క్రైమ్ మిర్రర్

Voice of Anti Corruption

హైదరాబాద్

24-11-2026

వెల: రూ.5/-

పేజీలు: 10+10

సంపుటి:16

సంచిక: 245

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



హైదరాబాద్ గోల్డ్ మ్యాన్ చిన్న గౌడ్‌పై ఐటీ కొరడా..

బావమరిది పేరుతో ఉన్న భారీ భవనం అటాచ్

బినామీ ఆస్తిగా ప్రాథమిక నిర్ధారణ.. అమ్మకాలపై నిషేధం

నెలవారీ అద్దె ఆదాయం చిన్న గౌడ్ భార్య ఖాతాలోకి మళ్లింపు

గతంలో 700 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్న ఐటీ శాఖ

మిగతా 2,లో



కష్టకాలంలో ఏడేళ్ల పాటు పీసీసీ చీఫ్‌గా పనిచేశా

నూతన ఇన్‌ఛార్జ్ బీఎం సందీప్‌తో భేటీ అయిన మంత్రులు ఉత్తమ్, తుమ్మల

గాంధీ భవన్‌తో తనకు ఎమోషనల్ అటాచ్‌మెంట్ ఉందన్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

తన శాఖలో ఒక్క రోజు కూడా విరామం లేకుండా పనిచేస్తున్నానని స్పష్టీకరణ

సంక్షోభంలో సాఫ్ట్‌వేర్!



సాఫ్ట్‌వేర్ రంగం సంక్షోభంలో పడింది. ఎక్కడికక్కడే లే ఆఫ్స్ ప్రకటిస్తున్నారు. ఆందోళనలో బాధిత కుటుంబాలు కనిపిస్తున్నాయి. ఒకప్పుడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం అంటే ఒకలాంటి భరోసా ఉండేది. మంచి జీతంతో పాటు స్థిరమైన ఆదాయం లభించేది. కుటుంబానికి ఆర్థిక భద్రత కూడా ఉండేది. మధ్యతరగతి కుటుంబాల కలలకు సాఫ్ట్‌వేర్ రంగం ఒక మార్గం గా కనిపించేది. ముఖ్యంగా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, పూణే వంటి నగరాల్లో వేలాది కుటుంబాలు ఈ రంగాన్ని ఆధారంగా చేసుకుని తమ భవిష్యత్తును నిర్మించుకున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా తిరోగమనం

ఉద్యోగులను తగ్గించుకుంటున్న దిగ్గజ సంస్థలు

వీధిన పడుతున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్: కానీ ఇప్పుడు పరిస్థితి మారుతోంది. చేతిలో మంచి ఉద్యోగం ఉన్నా రేపు ఉంటుందో లేదో తెలియదు పరిస్థితి. ఎప్పుడు తొలగింపు చేస్తారో నన్న భయం వెంటాడుతోంది. ఒకప్పుడు ఉద్యోగులను ఆకర్షించేందుకు పోటీపడిన కంపెనీలే ఇప్పుడు సిబ్బంది సంఖ్యను తగ్గించుకునేందుకు సిద్ధమవుతున్నాయి. మరోవైపు కొత్త ఉద్యోగులను నియమించుకున్న సంస్థలు సైతం ఉన్నాయి.

దిగ్గజ కంపెనీలు సైతం..

ప్రపంచ దిగ్గజ ఐటీ సంస్థలు సైతం ఉద్యోగులను తగ్గించుకునే పనిలో ఉన్నట్లు తెలుస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. క్వాల్ కామ్, ఇంటెల్, గూగుల్, మైక్రోసాఫ్ట్, సేల్స్ ఫోర్స్ వంటి అంతర్జాతీయ దిగ్గజాల నుంచి.. విప్రో, ఇన్ఫోసిస్, హెచ్ సి ఎల్ టెక్, టెక్

- మిగతా 2వ పేజీలో



బంగారం మరింత చౌకగా..!

భారీగా ధర పతనం

గరిష్ట స్థాయి నుంచి దాదాపు 30 నుంచి 32 శాతం తగ్గుదల

అంతర్జాతీయ వ్యవహారాలే కారణం



మిగతా 2,3లో

ఎయిర్ ఇండో ఎయిర్ లైన్స్!

ఏపీ కేంద్రంగా ప్రాంతీయ విమానయాన సంస్థ

హెడ్ క్వార్టర్ గా భోగాపురం ఎయిర్‌పోర్ట్

విజయసాయిరెడ్డి పార్టీలోకి నందమూరి మహిళ!

పరివర్తన్ రాజనీతి పార్టీలోకి తారకరత్న భార్య

పిఆర్పి ప్రధాన కార్యదర్శిగా అలేఖ్య

మిగతా 2,లో

క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ నేత విజయసాయిరెడ్డి పరివర్తన రాజనీతి పార్టీ ఏర్పాటు





కైలాసగిరికి కొత్త రోప్ వే!

22 ఏళ్ల కిందట ఏర్పాటు

గడువు ముగియడంతో కొత్తది నిర్మాణం

పర్యాటకులకు లూజ్ గ్రావిటీ రైడ్ తో సరికొత్త అనుభూతి

క్రైమ్ మిర్రర్, విశాఖపట్నం: విశాఖ నగరానికి పర్యాటకుల తాకిడి పెరుగుతోంది. నవంబరు నుంచి జనవరి వరకు పర్యాటకుల

మిగతా 2,లో

జగన్ వర్సెస్ షర్మిల.. మధ్యలో విజయమ్మ!

పిల్లల మధ్య నలిగిపోతున్న తల్లి

రోజురోజుకు పెరుగుతున్న ఆస్తి వివాదాలు

ఆవేదనలో వైయస్ కుటుంబ అభిమానులు



మిగతా 2,లో

కాంగ్రెస్‌లో ముఠా తగాదాలు లేవు..

కొత్త ఏఐసీసీ ఇన్‌ఛార్జితో భేటీ తర్వాత మంత్రి పొంగులేటి

ప్రభుత్వంపై ప్రజల్లో ఎలాంటి వ్యతిరేకత లేదన్న మంత్రి

కొత్త ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టి గాంధీ భవన్‌కు వచ్చిన బీఎం సందీప్

మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, తుమ్మలతో ఇన్‌చార్జి విడివిడిగా సమావేశాలు

రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల గెలుపే లక్ష్యంగా దిశానిర్దేశం

ఎమ్మెల్యేలు రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి వ్యవహారంపై నేతల ఆరా!



కాంగ్రెస్‌లో ఎలాంటి అంతర్గత విభేదాలు లేవని, ప్రభుత్వ పాలనపై ప్రజల్లోనూ ఎలాంటి వ్యతిరేకత లేదని రాష్ట్ర రెవెన్యూ, సమాచార

మిగతా 2,లో

ఏపీలో కొలువుదీరిన ‘పట్టణ’ పాలకవర్గాలు!

మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ల ప్రమాణ స్వీకారం

మూడు పార్టీల మధ్య సజావుగా పదవుల పంపకం

క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో: ఏపీవ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు సంబంధించి పాలకవర్గాలు కొలువుదీరాయి. తొలి విడత మున్సిపల్ ఎన్నికలు నిర్వహించిన కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు సంబంధించి డిప్యూటీ మేయర్లు, వైస్ చైర్ పర్సన్ పదవుల్లో కూటమి లో సర్దుబాటు పూర్తయింది.





కాంగ్రెస్‌లో ముఠా తగాదాలు లేవు..



(మొదటి పేజీ తరువాయి)

శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల కొత్త ఏఐసీసీ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన బీఎం సందీప్.. గాంధీ భవన్‌కు వచ్చిన సందర్భంగా మంత్రులు ఆయనతో వేర్వేరుగా భేటీ అయ్యారు. ఇన్‌చార్జితో సమావేశం ముగిసిన అనంతరం మంత్రి పొంగులేటి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రానికి తొలిసారి వచ్చిన సందీప్‌ను కేవలం మర్యాదపూర్వకంగానే కలిశానని, పార్టీ బలోపేతంపైనే చర్చించామని, ఎలాంటి అంతర్గత విషయాలు చర్చకు రాలేదని చెప్పారు. మరోవైపు గాంధీ భవన్‌లో కొత్త ఇన్‌చార్జి బీఎం సందీప్ వరుస సమీక్షలతో బిజీగా గడిపారు. పార్టీ నేతల మధ్య సమన్వయం పెంచే లక్ష్యంతో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులతోనూ ఆయన విడివిడిగా సమావేశాలు నిర్వహించారు. నియోజకవర్గాల్లో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వ పరిపాలన అంశాలపై మంత్రుల నుంచి వివరాలు సేకరించారు. క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్ఠతకు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. రాబోయే పట్టభద్రుల (గ్రాడ్యుయేట్) ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించడమే లక్ష్యంగా నాయకులు పనిచేయాలని సందీప్ దిశానిర్దేశం చేశారు. జిల్లాల్లో పార్టీ స్థితిగతులు, నాయకుల మధ్య సఖ్యతపై దృష్టి సారిం చారు. ఇటీవల పార్టీలో చర్చనీయాం శంగా మారిన ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డిల వివా దంపై డీసీసీ అధ్యక్షులు ఇన్‌చార్జికి ఫిర్యా దు చేసే అవకాశమున్నట్లు సమాచారం. డీసీసీ అధ్యక్షులతో పాటు సాయంత్రం పీసీసీ ముఖ్య నేతలు, వివిధ అనుబంధ సంఘాల అధ్యక్షులతోనూ సందీప్ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు.

విజయసాయిరెడ్డి పార్టీలోకి నందమూరి మహిళ!



చేసిన సంగతి తెలిసిందే. అయితే ఆ పార్టీలో అనూహ్యంగా నందమూరి కుటుంబానికి చెందిన మహిళ చేరారు. తారకరత్న భార్య అలేఖ్య ఆ పార్టీలో చేరగా.. ఆమెకు కీలక పదవి దక్కింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పిన విజయసాయిరెడ్డి కొద్ది రోజుల కిందట పరివర్తన రాజనీతి పార్టీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ పార్టీ పేరుతో ఇప్పటికే ఎన్నికల సంఘం వద్ద రిజిస్టర్ అయి ఉందని.. అందుకే పరివర్తన రాజనీతి పార్టీ రిజిస్ట్రేషన్ రద్దు చేసినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. దీనిపై విజయసాయిరెడ్డి ఫుల్ క్లారిటీ ఇచ్చారు.. ఈ వాదనతో ప్రజలను తప్పుదోవ పట్టించి.. పార్టీలో చేరికలను నియంత్రించేందుకు ఎత్తుగడ అంటూ చెప్పుకొచ్చారు విజయసాయిరెడ్డి. తమ పార్టీ రిజిస్ట్రేషన్ సక్రమంగానే జరిగిందని.. రాజ్యాంగం చట్టం వర్తించే అన్ని నిబంధనలకు అనుగుణంగా పనిచేయడానికి కట్టుబడి ఉన్నట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు విజయసాయిరెడ్డి. మరోవైపు నందమూరి అలేఖ్య పార్టీకి ప్రధాన కార్యదర్శిగా ఉన్నారని తెలిపారు. దక్షిణామూర్తి కోశాధికారిగా ఈ కమిటీలో కొనసాగుతున్నారని వివరించే ప్రయత్నం చేశారు.

గుండెపోటుతో భర్త మృతి..

నందమూరి తారకరత్న గుండెపోటుతో మృతి చెందిన సంగతి తెలిసిందే. సినిమా రంగంలో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయిన ఆయన రాజకీయాల వైపు ఆసక్తి చూపారు. తెలుగుదేశం పార్టీలో క్రియాశీలక పాత్ర పోషించారు. నారా లోకేష్ యువగళం పాదయాత్ర ప్రారంభ సమయంలో తారకరత్న గుండెపోటుకు గురయ్యారు. చాలా రోజులపాటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయనకు భార్య అలేఖ్య, ముగ్గురు పిల్లలు సైతం ఉన్నారు. ఆమె విజయసాయిరెడ్డి సమీప బంధువు. ఆయన భార్య చెల్లెలు కుమార్తె. వరుసకు విజయసాయిరెడ్డి బాబాయి అవుతారు. తారకరత్న మృతి సమయంలో ఆ కుటుంబానికి ఎంతగానో అండగా నిలిచారు. అదే సమయంలో చంద్రబాబుతో పాటు బాలకృష్ణతో అత్యంత ఆత్మీయంగా కనిపించేవారు.

రాజకీయాలపై ఆసక్తి..

తారకరత్న మృతి చెందిన కొద్దికాలం తర్వాత అలేఖ్య కీలక ప్రకటన చేశారు. తనకు రాజకీయాల్లోకి ఉందని ఆసక్తి కనబరిచారు. దీంతో అంతా ఆమె తెలుగుదేశం పార్టీలో చేరుతారని భావించారు. కానీ ఇప్పుడు విజయసాయిరెడ్డి పిఆర్పి లో ప్రధాన కార్యదర్శి పదవిలో ఆమె నియమితులు కావడం గమనార్హం. విజయసాయిరెడ్డి పార్టీలో పెద్ద ఎత్తున చేరికలు ఉంటాయని ఊహాగానాలు వచ్చాయి. కానీ ఆశించిన స్థాయిలో చేరికలు పెరగలేదు. అందుకే ఆయన పునరాలోచనలో పడ్డారు. నందమూరి కుటుంబ మహిళకు ఏకంగా పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి కట్టబెట్టారు.

సంక్షోభంలో సాఫ్ట్‌వేర్!



మహేంద్ర వంటి భారతీయ సంస్థల వరకు ఉద్యోగుల విషయంలో పునర్వ్యవస్థీకరణ జరుగుతోంది. ఇది కేవలం ఒకటి రెండు కంపెనీల సమస్య కాదు. ప్రపంచ సాంకేతిక రంగంలో వస్తున్న నిర్మాణాత్మక మార్పులకు సంకేతం. ప్రపంచవ్యాప్తంగా టెక్నాలజీ కంపెనీలు ఉద్యోగాల కోసం తీవ్రతను అర్థం చేసుకోవడానికి.. 2026 నాటి గణాంకాలను పరిశీలించాలి. నవంబరు 18 నాటికి అందుబాటులో ఉన్న ఒక అంతర్జాతీయ ట్రాకర్ ప్రకారం.. ఈ యాడాదిలో ఇప్పటివరకు 365 కంపెనీల్లో.. 1,594 18 మంది ఉద్యోగాలు కోల్పోయారు. 2025లో ఇదే కాలంతో పోలిస్తే ఆ సంఖ్య 36.6% ఎక్కువ. ఇది ప్రైవేటు సంస్థ సేకరించిన ట్రాకర్ గణాంకం మాత్రమే. ప్రపంచంలోని అన్ని ఉద్యోగ కోతలను కలిపిన అధికారిక ప్రభుత్వ లెక్క కాదు. అయినా సరే సమస్య విస్తృతాన్ని తెలియజేస్తోంది. అమెరికాకు చెందిన క్వాల్ కామ్ సంస్థలో ఉద్యోగుల తొలగింపు ప్రక్రియ మొదలైంది. సంస్థ సీఈవో క్రిస్టియానో ఆమెన్ అక్టోబరు 24 ఉద్యోగులకు పంపిన అంతర్గత సందేశంలో దీన్ని పెర్ఫార్మన్స్ ఫోకస్ రిడక్షన్ గా పేర్కొన్నారు. అయితే భారతదేశంలోనూ దీని ప్రభావం కనిపిస్తోంది. మనీ కంట్రోల్ నవంబర్ 11న వెల్లడించిన సమాచారం ప్రకారం బెంగళూరు, హైదరాబాద్ కార్యాలయాల్లో ఉద్యోగుల తొలగింపు ప్రక్రియ ప్రారంభం అయింది. దేశవ్యాప్తంగా వెయ్యి మందికి పైగా ఉద్యోగులు ప్రభావితం అయ్యే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాల అంచనా.

- ఇంటెల్ సంస్థలో ఇదే పరిస్థితి. నవంబరు 17, 18 తేదీల్లో ఉద్యోగుల కోత విధించారు. ముఖ్యంగా గ్లోబల్ ఐటీ విభాగంలో ఉద్యోగులు ప్రభావితమైనట్లు సమాచారం. సెప్టెంబర్ చివరి నాటికి ఉద్యోగుల సంఖ్య 81, 100 కు తగ్గింది. 2025లో ఆ సంఖ్య 85,100 గా ఉండేది
- గూగుల్ కూడా ఉద్యోగుల విషయంలో కొత్త విధానాన్ని అనుసరిస్తోంది. ఏఐ రంగంలో భారీ పెట్టుబడులు పెడుతున్న సమస్త నిర్వహణ వేయాలని నియంత్రించేందుకు కొన్ని దేశాల్లో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పథకాలను విస్తరించింది. కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, స్విట్జర్లాండ్ వంటి దేశాల్లో ఈ అవకాశం కల్పించింది
- మైక్రోసాఫ్ట్ జూలై 2026లో సుమారు 4800 ఉద్యోగాలను తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ఇది ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగుల్లో 2.1%.. గత ఏడాది కాలంలో 4,000 మందికి పైగా ఉద్యోగులను ఇతర విభాగాలకు బదిలీ కూడా చేసింది.
- అయితే ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగుల తొలగింపులు జరుగుతున్నప్పటికీ భారతదేశంలోని ఐటీ రంగంలో పూర్తిగా ఒకే విధంగా లేదు. కొన్ని సంస్థలు ఉద్యోగుల సంఖ్యను తగ్గిస్తుంటే.. మరికొన్ని సంస్థలు పెద్ద సంఖ్యలో కొత్తగా ఉద్యోగులను నియమించుకుంటున్నాయి.

కైలాసగిరికి కొత్త రోప్ వే!

సంఖ్య ఎక్కువగా ఉంటుంది. విశాఖ నగరం తో పాటు అరకు, పాడేరు, లంబసింగి వంటి ప్రాంతాలకు ఎక్కువగా పర్యాటకులు వస్తుంటారు. అయితే సుదూర ప్రాంతాల నుంచి వచ్చేవారు విశాఖను ఆశ్రయిస్తుంటారు. ఈ తరుణంలో పర్యాటకుల సంఖ్య పెరగడంతో విశాఖ నగరంలో పర్యాటక శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా కైలాసగిరి కి కొత్త రోప్ వే నిర్మించే దిశగా అడుగులు పడుతున్నాయి. దాదాపు 20 ఏళ్లుగా ఉన్న పాత రోప్ వేను తొలగించి.. కొత్త రోప్ వే ఏర్పాటు చేసేందుకు గత ఏడాది నుంచి టెండర్లు పిలుస్తున్న ఎవరూ ముందుకు రాలేదు. అప్పటినుంచి టెండర్ల ప్రక్రియ పెండింగ్లో ఉంది. ఇటీవల బోర్డు సమావేశంలో ప్రస్తుత కాంట్రాక్టర్ ఎల్.1 గా నిలవడంతో.. వారికే పనులు అప్పగించడానికి ఆమోదం తెలిపారు. త్వరలో పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

రెండు దశాబ్దాల కిందట..

22 సంవత్సరాల కిందట విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ పర్యాటకుల కోసం వినూత్నంగా ఆలోచించింది. 2004లో కైలాసగిరి వెళ్లేందుకు మెట్లు, రోడ్డు మార్గం కాకుండా రోప్ వేను అందుబాటులోకి తీసుకువచ్చింది. అప్పట్లో మూడు కోట్ల రూపాయలతో దీనిని ఏర్పాటు చేశారు. 2004 నాటి రోప్ వే 20 ఏళ్ల పాటు గడువు విధించారు. ఇప్పుడు ఆ ఆ గడువు ముగిసి చాలా రోజులు అయింది. ప్రస్తుతం దాని నిర్వహణ సరిగ్గానే ఉంది. అయినా సరే ముందస్తు చర్యల్లో భాగంగా కొత్త రోప్ వే ను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. అయితే ఈసారి దాని విస్తరణ పెరగనుంది. కొండపై నుంచి తెలుగు మ్యూజియం ఒకటి పాయింట్ ఐదు కిలోమీటర్ల వరకు పెంచాలని ప్రతిపాదించారు.



సింగపూర్ తరహాలో..

ఈ కొత్త రోప్ వే కు సంబంధించి సింగపూర్ తరహాలోనే లూజ్ గ్రావిటీ రైడ్ ను ఏర్పాటు చేసేందుకు డిజైన్లు రూపొందించారు. కానీ టెండర్లు పిలిస్తే ఎవరూ ముందుకు రాలేదు. ఆ తరువాత ఒక్కటే టెండర్ వేశారు. వాళ్లు కూడా ఖర్చు ఎక్కువగా అవుతుందని భావించారు. ఆదాయంలో వాటా పెంచాలని కోరారు. ఈ క్రమంలో కొత్త రోప్ వే ప్రాజెక్టు మధ్యలో ఆగిపోయింది. పాత రోప్ వే నడుపుతున్నారు. ఇంతలో గతంలో టెండర్ వేసిన సంస్థ నిర్మాణానికి ముందుకు వచ్చింది. అధికారులతో చర్చించిన తర్వాత ఎల్ 1 కింద ఆ సంస్థకే కాంట్రాక్ట్ ఖాయం చేశారు. త్వరలో పనులకు గ్రీన్ సిగ్నల్ వస్తుందని చెబుతున్నారు. ఈ మేరకు కొత్త రోప్ వే లూజ్ గ్రావిటీ రైడ్ ని శివపార్వతుల విగ్రహం దగ్గర నుంచి 600 మీటర్ల పొడవు నా ఏర్పాటు చేస్తారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు కైలాసగిరిని బెస్ట్ టూరిజం స్పాట్గా రూపొందిస్తామని వి.ఎం.ఆర్.డి.ఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ తెలిపారు.

ఎయిర్ ఇండో ఎయిర్ లైన్స్!

(మొదటి పేజీ తరువాయి)

క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో: ఏపీ కేంద్రంగా ఏర్పాటయింది ఎయిర్ ఇండో ఎయిర్లైన్స్. ప్రాంతీయ విమానయాన సంస్థగా అందుబాటు లోకి వచ్చింది. రాష్ట్ర విమానయాన రంగంలో సరికొత్త అధ్యయనానికి శ్రీకారం చుడుతోంది. శ్రీనివాస్ చిలుకూరి నేతృత్వంలో రూపొందించిన ఈ సంస్థ.. అత్యాధునిక ఏ టి ఆర్ 72- 600 విమాన శ్రేణితో మే 2027 నుంచి తన వాణిజ్య విమాన సేవలను ప్రారంభించేందుకు సన్నద్ధం అవుతోంది. టైర్ 2, టైర్ 3 నగరాల మధ్య విమాన అనుసంధానాన్ని పెంచడం ద్వారా సామాన్యు లకు సైతం అందుబాటు ధరల్లో.. వేగవంతమైన ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడమే లక్ష్యంగా ఈ ఎయిర్ లైన్స్ అడుగులు వేస్తోంది.

ఆ రెండు విమానాశ్రయాలు కేంద్రంగా..: ఈ ప్రాంతీయ విమానయాన సంస్థ తన కార్యకలాపాలను ప్రారంభించింది. ఏపీలో రెండు విమానాశ్రయాలను ప్రధాన కేంద్రాలుగా చేసుకుంది. భోగాపురం లోని నూతన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఎయిర్ ఇండో ఎయిర్లైన్స్ కు ప్రధాన బేస్ ఎయిర్ పోర్టుగా వ్యవహరించనుంది. అలాగే రాజధాని ప్రాంతంలోని విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం ఈ విమానాల పార్కింగ్, నిర్వహణకు ప్రధాన హబ్ గా ఉపయోగపడనుంది. ప్రాథమికంగా 3 ఏటిఆర్ 72 - 600 విమానాలతో సేవలను ప్రారంభించి.. విమానాల సంఖ్యను విస్తరించాలని ప్రణాళికలు రచించింది.

తొలి దశలో ఇలా..: తొలి దశలో ఏపీ కారిడార్ లో భాగంగా విశాఖ - విజయవాడ- హైదరాబాద్ నగరాల మధ్య 45 నుంచి 60 నిమిషాల వ్యవధిలోనే చేరుకునేలా విమానాలను నడపాలని ప్రతిపాదించింది. దీనితోపాటు విజయవాడ - గోవా.. అలాగే హైదరాబాద్- భోపాల్ - పూణే కారిడార్లను కూడా తన నెట్వర్క్ లో చేర్చేందుకు సన్నాహాలు చేస్తోంది. కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ నుంచి ప్రాథమిక ఎన్ఓసి, కేంద్ర హోం శాఖ నుంచి సెక్యూరిటీ క్లియరెన్స్ పొందిన ఎయిర్ ఇండో ఎయిర్లైన్స్.. ప్రస్తుతం డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ నుంచి తుది అనుమతుల కోసం ఎదురుచూస్తోంది.

కష్టకాలంలో ఏడేళ్ల పాటు
పీసీసీ చీఫ్‌గా పనిచేశా

హైదరాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయం గాంధీ భవన్‌తో తనకు ఎంతో అనుబంధం ఉందని రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గాంధీ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ నూతన ఇన్‌చార్జ్ బీఎం సందీప్‌తో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు భేటీ అయ్యారు. పార్టీ అంతర్గత వ్యవహారాలతో పాటు తాజా రాజకీయ పరిణామాలపై వీరు చర్చించారు. ఈ భేటీ అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో తాను ఏడేళ్ల పాటు పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. "గాంధీ భవన్‌తో సెంటిమెంటల్, ఎమోషనల్ అటాచ్‌మెంట్ ఉంది" అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పూర్తి నిబద్ధతతో పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. "నా శాఖలో అద్భుతమైన పని జరుగుతోంది. ఒక్క రోజు, ఒక్క గంట కూడా విరామం లేకుండా పని చేస్తున్నా" అని తెలిపారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ తీరుపై కూడా ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. "బీఆర్ఎస్ హయాంలో మాటలు ఎక్కువ, పని తక్కువ" అని విమర్శించారు. నాటి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ బోగస్ అని కొట్టిపారేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటల కంటే చేతలకే ప్రాధాన్యం ఇస్తోందని, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని చెప్పారు.

హైదరాబాద్ గోల్డ్ మ్యాన్ చిన్న గౌడ్‌పై ఐటీ కొరడా..

హైదరాబాద్‌లో 'గోల్డ్ మ్యాన్'గా పేరుగాంచిన యాదగిరి చిన్న గౌడ్ అలియాస్ దర్గా చిన్న పహిల్వాన్‌కు ఆదాయపు పన్ను (ఐటీ) శాఖ గట్టి షాక్ ఇచ్చింది. బినామీ ఆస్తుల నిరోధక విభాగం రంగంలోకి దిగి, రాయదుర్గంలో ఉన్న ఆయనకు చెందిన ఓ భారీ అపార్ట్‌మెంట్ భవనాన్ని తాత్కాలికంగా అటాచ్ చేసింది. ఈ ఆస్తి చిన్న గౌడ్ బావమరిది ప్రణయ్ గౌడ్ పేరు మీద రిజిస్టర్ అయి ఉన్నప్పటికీ, దాని అసలు లబ్ధిదారుడు చిన్న గౌడే అని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. దీంతో ఆ భవనాన్ని, దాని ద్వారా వచ్చే అద్దె ఆదాయాన్ని కూడా ఫ్రీజ్ చేశారు. తుది ఉత్తర్వులు వెలువడే వరకు ఆస్తిని అమ్మడం, బదిలీ చేయడం లేదా ఇతరులకు అప్పగించడంపై నిషేధం విధించారు. దర్యాప్తు ప్రకారం.. శేరిలింగంపల్లి పరిధిలోని రాయదుర్గంలో 222 చదరపు గజాల స్థలాన్ని 2019 జూలైలో కొనుగోలు చేశారు. పత్రాల్లో రూ.26.70 లక్షలుగా విలువ చూపగా, ఈ నిధులన్నీ తన బావ చిన్న గౌడ్ సమకూర్చినట్లు ప్రణయ్ గౌడ్ విచారణలో అంగీకరించినట్లు తెలిసింది. స్థలం కొనుగోలు సమయంలో తాను విద్యార్థినని, ఎలాంటి ఆదాయం లేదని కూడా ఆయన వెల్లడించారు. ఆ తర్వాత ఆ స్థలంలో గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు ఐదు అంతస్తుల భవనాన్ని నిర్మించారు. దీని నిర్మాణానికి అవసరమైన డబ్బును కూడా చిన్న గౌడే సమకూర్చినట్లు ప్రణయ్ స్వచ్ఛంద వాంగ్మూలంలో పేర్కొన్నారు. అపార్ట్‌మెంట్‌కు నెలకు రూ.3.20 లక్షల అద్దె వస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. అయితే ఈ అద్దె డబ్బులు ఆస్తి యజమానిగా ఉన్న ప్రణయ్ ఖాతాలోకి కాకుండా, చిన్న గౌడ్ భార్య బ్యాంకు ఖాతాకు, అక్కడి నుంచి చిన్న గౌడ్ ఖాతాలకు బదిలీ అయినట్లు అధికారులు గుర్తించారు.దీంతో ప్రణయ్‌ను బినామీదారుడిగా, చిన్న గౌడ్‌ను అసలు లబ్ధిదారుడిగా పేర్కొంటూ ఐటీ శాఖ జాయింట్ కమిషనర్ నవంబర్ 17న తాత్కాలిక అటాచ్‌మెంట్ ఉత్తర్వులు జారీ చేశారు. బినామీ ఆస్తుల లావాదేవీల నిషేధ చట్టం-1988 కింద ఈ చర్యలు తీసుకున్నారు.గతంలో చిన్న గౌడ్ పలు యూట్యూబ్ ఛానెళ్లకు ఇంటర్వ్యూలు ఇవ్వడంతో ఐటీ శాఖ ఆయనపై దృష్టి సారించింది. ఏప్రిల్‌లో సోదాలు నిర్వహించి, అతని వద్ద ఉన్న 900 గ్రాముల బంగారంలో, 700 గ్రాములకు సరైన లెక్కలు చూపకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. తన ఐటీ రిటర్నుల్లో కేవలం రూ.4 లక్షల ఆదాయం మాత్రమే చూపిన చిన్న గౌడ్ వద్ద ఇంతటి ఆస్తులు ఎలా సమకూరాయనే కోణంలో అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. తాజాగా బినామీ ఆస్తిని అటాచ్ చేయడం ఈ కేసులో కీలక పరిణామంగా మారింది.

జగన్ వర్సెస్ షర్మిల.. మధ్యలో విజయమ్మ!



క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో: వైయస్ రాజశేఖర్ రెడ్డి.. తెలుగు రాజకీయాల్లో ఒక బ్రాండ్. ప్రాంతీయ పార్టీల దెబ్బకు పూర్తిగా కనుమరుగైన కాంగ్రెస్ పార్టీకి జీవం పోసిన మహానేత. ఏపీలో కాంగ్రెస్ పార్టీని అధికారంలో తేవడమే కాదు. జాతీయ స్థాయిలో సైతం కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చిన నాయకుడు. సంక్షేమ తారక మంత్రంతో ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన రాజశేఖర్ రెడ్డి కుటుంబంలో ఇప్పుడు వ్యక్తిగత విభేదాలతో ఏర్పడిన కల్లోలం కట్టు దాటుతోంది. తల్లి విజయమ్మ ఇద్దరి పిల్లల మధ్య నలిగిపోతోంది. అన్నాచెల్లెళ్ల మధ్య గత కొంతకాలంగా విభేదాలు కొనసాగుతుండగా.. తాజాగా బెంగళూరులోని యలహంక ప్యాలెస్ వివాదం తెరపైకి వచ్చింది. కోర్టు వరకు వెళ్ళింది. తన కుమార్తె పెళ్లి వేదికగా ఎలహంక ప్యాలెస్ ను ఉపయోగించుకోవాలని భావించిన షర్మిలకు షాక్ తగిలింది. జగన్ అందుకు అంగీకరించలేదు. ఇప్పుడు షర్మిల తో పాటు ఆమె తల్లి విజయమ్మ వెళ్లకుండా ప్యాలెస్ వద్ద భారీగా భారీ కేట్లు ఏర్పాటు చేయడం సంచలనంగా మారింది. దీనిపై పోరాటానికి షర్మిల సిద్ధపడుతున్నారు. పాలసీ ఎదుట ధర్నా చేసేందుకు సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది.

అప్పటినుంచి వివాదం..

గతంలో షర్మిల కుమార్తె వివాహాన్ని యలహంక ప్యాలెస్ లో నిర్వహించాలని నిర్ణయించడంతో వివాదం మొదలైంది. ఆ ఇంట్లో తాను నివసిస్తున్నందున పెద్ద సంఖ్యలో అతిథులు, ఈవెంట్ సిబ్బంది రాకపోకల వల్ల భద్రత, గోప్యతకు ఇబ్బందులు ఎదురవుతాయని జగన్ అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం.. ప్రత్యామ్నాయంగా హైదరాబాదులోని లోటస్ పాండ్ నివాసాన్ని వినియోగించుకోవాలని సూచించినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో యలహంక ఆస్తి పై తనకు, తన పిల్లలకు హక్కు ఉందని షర్మిల వాదిస్తున్నారు. తమ తండ్రి రాజశేఖరరెడ్డి హయాంలో కుటుంబ ఆస్తుల్లో భాగంగా ఆస్తిని తమకు కేటాయించారని షర్మిల చెప్పుకొస్తున్నారు. 2019లో జరిగిన కుటుంబ అవగాహన ఒప్పందాన్ని కూడా తన వాదనకు ఆధారంగా ప్రస్తావిస్తున్నారు. దీంతో ఈ ఆస్తి వివాదం మరింత ముదిరింది.

విజయమ్మ బాధ అంతా ఇంతా కాదు..

అయితే ఇద్దరు పిల్లల మధ్య విజయమ్మ నలిగిపోతున్నారు. అయితే విజయమ్మ సైతం ఆ ఆస్తిలో షర్మిల పిల్లలకు వాటా ఉందని బలంగా చెబుతున్నారు. అయితే ఈ ప్యాలెస్ విషయంలో షర్మిల పట్టుబడుతున్న నేపథ్యంలో జగన్ కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలు ఉన్నాయని చెబుతూ ఆ ప్యాలెస్ వైపు షర్మిల, విజయమ్మ రాకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. పోలీసులతో వాగ్వాదానికి దిగారు షర్మిల. విజయమ్మ సైతం పూర్తిగా నిర్వేదంతో కనిపించారు. అయితే ఆ ప్యాలెస్ ఎదుట ధర్మ పోరాటానికి షర్మిల దిగనున్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే రాజకీయంగా జగన్మోహన్ రెడ్డికి ఇబ్బందులు తప్పవు. అయితే ఈ మొత్తం పరిణామాలతో వైయస్ కుటుంబ అభిమానులు తీవ్ర ఆవేదనతో ఉన్నారు.

ఏపీలో కొలువుదీరిన 'పట్టణ' పాలకవర్గాలు!

మూడు పార్టీల మధ్య పదవుల సర్దుబాటులో భాగంగా టిడిపికి 66, జనసేనకు 23, బిజెపికి తొమ్మిది పదవులు కేటాయించారు. డిప్యూటీ మేయర్ అభ్యర్థులను టిడిపి ప్రకటించింది. జనసేన కూడా డిప్యూటీ మేయర్, చైర్పర్సన్ అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. వారు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని కార్పొరేషన్ల తో పాటు మున్సిపాలిటీల్లో కార్యవర్గాల బాధ్యతల స్వీకారం పూర్తయింది

- మొత్తం 13 కార్పొరేషన్లకు గాను టిడిపి అభ్యర్థులు పది చోట్ల మేయర్ గా గెలిచారు. ఏడు చోట్ల డిప్యూటీ మేయర్ పదవులను సైతం టిడిపి దక్కించుకుంది. జనసేన మేయర్ పదవులను గెలుచుకున్న విజయవాడ, ఏలూరు కార్పొరేషన్ లతోపాటు వైసీపీ అనంతపురం కార్పొరేషన్ గెలిచింది. మొత్తం 87 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో టిడిపికి 59 వైస్ చైర్ పర్సన్ పదవులు దక్కాయి. జనసేన చైర్పర్సన్ పదవులను గెలుచుకున్న 18 మునిసిపాలిటీల్లో.. పిఠాపురం, గొల్లప్రోలు మినహా మిగతా అన్నిచోట్ల వైస్ చైర్పర్సన్ పదవులను టిడిపికి కేటాయించారు. బిజెపి చైర్పర్సన్లు గెలిచిన గిద్దలూరు, గూడూరు, ఎర్రగుంట్ల, ఎలమంచిలి లో వైస్ చైర్ పర్సన్ పదవులు టిడిపికి కేటాయించారు.
- జనసేనకు నాలుగు కార్పొరేషన్ల డిప్యూటీ మేయర్ పదవులతోపాటు 19 మున్సిపాలిటీలకు సంబంధించి వైస్ చైర్ పర్సన్ పదవులు దక్కాయి. టిడిపి మేయర్ పదవులు దక్కించుకున్న విశాఖ, మచిలీపట్నం, తిరుపతి, గుంటూరు కార్పొరేషన్లలో డిప్యూటీ మేయర్ పదవులను జనసేనకు ఇచ్చారు. బిజెపికి కర్నూలు, నెల్లూరు కార్పొరేషన్ల డిప్యూటీ మేయర్ పదవులతో పాటు ఏడు మున్సిపాలిటీల్లో వైస్ చైర్పర్సన్ పదవులు కేటాయించారు.

ఝాన్సీ లక్ష్మీబాయి పార్కును అభివృద్ధి చేయండి!

ప్రజావాణిలో సీయంసీ కమిషనర్ జి. సృజనకు ఎన్నారై కాలనీ వాసుల వినతి



నిజాంపేట్, నవంబర్ 23 (క్రైమ్ మిర్రర్): ప్రగతి నగర్ 276వ డివిజన్లోని ఎన్నారై కాలనీలో గల ఝాన్సీ లక్ష్మీబాయి పార్కు సమస్యలను పరిష్కరించి, సమగ్రంగా అభివృద్ధి చేయాలని ఎన్నారై కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్షుడు బొట్ల తిరుపతి, కోశాధికారి వడ్లకొండ సందీప్‌తో పాటు ఇతర కాలనీవాసులు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి. సృజనకు వినతిపత్రం అందజేశారు. పార్కును వెంటనే పునరుద్ధరించి, ఆధునీకరించడంతో పాటు నూతన పిల్లల ఆటపరికరాలు ఆ మార్చాలని, ఓపెన్ జిమ్ పరికరాలకు మరమ్మతులు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై సానుకూలంగా స్పందించిన కమిషనర్ జి. సృజన, క్షేత్రస్థాయిలో పార్కు పరిస్థితిని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ ఫిర్యాదును ఇంజనీరింగ్ విభాగం పరిధిలో నమోదు చేసి, తదుపరి చర్యల నిమిత్తం సంబంధిత ఏఈ పి. ప్రవీణ్ కుమార్‌కు కేటాయించారు.

బంగారం మరింత చౌకగా..!



క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్: బంగారం ధర రికార్డు స్థాయిలో పతనం దిశగా అడుగులు వేస్తోంది. ఈ ఏడాది జనవరిలో రికార్డు స్థాయిలో రూ. 1.80 లక్షలు దాటిన బంగారం ధర.. ఇప్పుడు వరుసగా పతనం అవుతూ సామాన్య కొనుగోలుదారుడుకు ఊరట నిస్తోంది. కానీ ఇన్వెస్టర్లను మాత్రం ఆందోళనకు గురిచేస్తోంది. ప్రస్తుతం ఎంసీఎక్స్ మార్కెట్లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1.22 లక్షల స్థాయికి పడిపోయింది. గరిష్ట స్థాయి నుంచి దాదాపు 30 నుంచి 32 శాతం మేర దిగి వచ్చింది. కమోడిటీ నిపుణుల విశ్లేషణ ప్రకారం.. ఈ పతనానికి ప్రధానంగా మూడు కారణాలు ఉన్నాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించడానికి బదులు మళ్లీ పెంచే అవకాశాలు ఉండడం.. డాలర్ విలువ 19 నెలల గరిష్టానికి చేరి అమెరికా బాండ్ ఈల్డ్స్ పెరగడం, డాలర్ తో పోలిస్తే భారత రూపాయి బలపడడం.. వీటికి తోడు అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లలో ఏఐ షేర్ల పతనం వల్ల నగదు అవసరాల కోసం ఇన్వెస్టర్లు బంగారం పెట్టుబడులను విక్రయించడం కూడా ధరలపై తీవ్ర ఒత్తిడిని తెచ్చి పెట్టింది.

లక్షకు తక్కువగా..

అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ బంగారం ధరకు 3500 డాలర్ల వద్ద బలమైన మద్దతు ఉంది. ఒకవేళ ఆ స్థాయిని దాటి కిందకు పడిపోతే 3300 డాలర్ల వరకు వెళ్లే అవకాశం ఉంది. అదే జరిగితే దేశీయ మార్కెట్లో 10 గ్రాముల బంగారం ధర రూ. 1,17,500 స్థాయికి చేరవచ్చని అంచనా వేస్తున్నారు. అయితే బంగారం ధర లక్షలు కంటే దిగువకు పడిపోయే అవకాశాలు చాలా తక్కువ. ప్రస్తుత ధరలు ఓవర్ సోల్డ్ జోన్ లో ఉన్నందున పెళ్లిళ్ల సీజన్ కొనుగోలు, వాల్యూ బయింగ్ వల్ల త్వరలో తిరిగి కోలుకునే అవకాశం ఉంది.

వచ్చే ఏడాది చివరి నాటికి..

మరోవైపు 2027 చివరి నాటికి బంగారం ధరలు మళ్ళీ పైకి ఎగబాకుతాయని అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు అంచనా వేస్తున్నాయి. ప్రముఖ ఇన్వెస్ట్మెంట్ బ్యాంకు గోల్డ్ మన్ సాక్స్ రాజా నివేదిక ప్రకారం సమీప భవిష్యత్తులో ఫెడ్ వడ్డీ రేట్ల పెంపు వల్ల ఒత్తిడి ఉన్నప్పటికీ.. 2027 చివరి నాటికి వడ్డీ రేట్ల తగ్గింపు మొదలవుతుందని.. చైనా సహా వివిధ దేశాల సెంట్రల్ బ్యాంకుల కొనుగోలు సాగుతూ ఉండడంతో 2027 నాటికి ఔన్స్ బంగారం 4650 డాలర్లకు చేరుతుందని అంచనా వేసింది. ఇక దేశీయ మార్కెట్ అంచనా ప్రకారం 2027లో 10 గ్రాముల బంగారం తిరిగి రూ.1.60 లక్షల నుంచి రూ.1.80 లక్షల శ్రేణిలోకి చేరే అవకాశం ఉంది అని మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు. బంగారం ధరల్లో ప్రస్తుత తగ్గుదల కేవలం అంతర్జాతీయ వడ్డీ రేట్లు, డాలర్ కదలికల వల్ల ఏర్పడిన తాత్కాలిక సర్దుబాటు మాత్రమేనని నిపుణులు చెబుతున్నారు.





ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నిరాహార దీక్ష

భారీ ర్యాలీతో తరలి వెళ్లి సంఘీభావం తెలిపిన శేరిలింగంపల్లి బిఆర్ఎస్ నేత అశ్వంత్ కుమార్

కూకట్ పల్లి, నవంబర్ 23 (క్రైమ్ మిర్రర్) : కూకట్‌పల్లిలోని ట్రక్ పార్క్ భూములు, హౌసింగ్ బోర్డు భూములను రేవంత్ రెడ్డి ప్రభుత్వం వేలం వేయడాన్ని నిరసిస్తూ ప్రజా అవసరాల కోసం ఆ భూములను కాపాడాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) తదితర పార్టీల ఆధ్వర్యంలో కొనసాగుతున్న శాంతియుత నిరాహార దీక్షకు శేరిలింగంపల్లి నియోజకవర్గ బిఆర్ఎస్ నేత అశ్వంత్ కుమార్ సంఘీభావం తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీగా దీక్షా శిబిరానికి చేరుకున్నారు.ఈ సందర్భంగా అశ్వంత్ కుమార్ మాట్లాడుతూ.. ప్రజా అవసరాలకు ఉపయోగపడాల్సిన భూములను కాంగ్రెస్ ప్రభుత్వం వేలం వేయడానికి ప్రయత్నించడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. గత పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో కేసీఆర్ నాయకత్వంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కూకట్‌పల్లిలోని ప్రభుత్వ భూములను కాపాడుకుంటూ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారని పేర్కొన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న జనాభా దృష్ట్యా భవిష్యత్తులో ప్రజలకు అవసరమైన పార్కులు, ఆటస్థలాలు, ఇతర మౌలిక సదుపాయాల కోసం ఈ భూములు ఎంతో అవసరమని తెలిపారు. ప్రజా అవసరాలకు ఉపయోగపడాల్సిన భూములను అమ్ముకుంటే రాబోయే తరాలకు తీవ్ర నష్టం జరుగుతుందని అన్నారు. ఎన్నో ఏళ్లుగా ప్రజల భవిష్యత్తు కోసం కాపాడుకుంటూ వచ్చిన భూములను ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వేలం వేయాలని చూడటం సరికాదని, ఈ భూములను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అశ్వంత్ కుమార్ స్పష్టం చేశారు.ప్రజా ప్రయోజనాల కోసం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేపట్టిన శాంతియుత నిరాహార దీక్షకు తమ సంపూర్ణ సంఘీభావం ప్రకటిస్తున్నామని, ట్రక్ పార్క్, హౌసింగ్ బోర్డు భూములను కాపాడుకునే పోరాటంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజలతో కలిసి ఉంటారని అశ్వంత్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన ముఖ్య నాయకులు అక్షయ పటేల్, గిరీష్, దుర్గ, సిద్ధార్థ, అఖిల్, లక్ష్మీ ప్రసాద్, సందీప్, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు కృష్ణవేణి విద్యార్థులు

క్రీడలతో చెడు అలవాట్లకు దూరం: సీఐ పర్స రమేష్



మందమర్రి, నవంబర్ 23(క్రైమ్ మిర్రర్) : రాష్ట్రస్థాయి అండర్–17 బాలుర నెట్‌బాల్ పోటీలకు మందమర్రి పట్టణం పాత బస్టాండ్‌లోని హైదరాబాద్ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారిని స్థానిక సీఐ పర్స రమేష్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ నెల 17న నిర్వహించిన జోనల్ స్థాయి నెట్‌బాల్ పోటీల్లో మంచిర్యాల జిల్లా జట్టు తరఫున పాఠశాల విద్యార్థులు ఎస్.కె.షహబాజ్, పిప్రే శివచరణ్, రేకుల సాహెత్, వేముల శశివర్ధన్, నాగుల జాయ్ ప్రతిభ కనబరిచారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లా జట్లపై విజయం సాధించి జట్టు ప్రథమ స్థానంలో నిలవడంలో కీలక పాత్ర పోషించారు. దీంతో వీరంతా రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, పాఠశాలల్లో ఆటలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. చదువు, క్రీడలపై దృష్టి సారిస్తే చెడు అలవాట్లకు దూరంగా ఉండవచ్చన్నారు. ఒకే పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పట్టణానికి, జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు.

GHMC
hmda
Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com
SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
4 మంగళవారం 24-11-2026

ఎల్బీనగర్ ఎమ్మెల్యే, ఆయన అనధికారిక పీఆర్ఓ బహిరంగ క్షమాపణ చెప్పాల్సిందే!

జర్నలిస్టుల ఆత్మగౌరవాన్ని కించపరిస్తే సహించేది లేదు..
ఐక్య పోరాటంతో తగిన సమాధానం చెబుతాం!
జర్నలిస్టుల సంక్షేమం పట్టదా? ప్రజాప్రతినిధుల బాధ్యత ఇదేనా?



క్రైమ్ మిర్రర్, ఎల్బీనగర్ : జర్నలిస్టుల ఆత్మగౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని, ప్రజా సమస్యలను ప్రశ్నించే మీడియా గొంతుకలను అవమానిస్తే ఐక్య పోరాటంతో తగిన సమాధానం చెబుతామని ఎల్బీనగర్ వర్కింగ్ జర్నలిస్టుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) నాయకులు సమరభేరి మోగించారు. జర్నలిస్టు రాజుపై ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అనధికారిక పీఆర్ఓగా పేర్కొంటున్న హరికృష్ణ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ సోమవారం ఎల్బీనగర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పి ఆర్ ఓ, హరికృష్ణ తక్షణమే తమ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని జర్నలిస్టు సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులను అవమానించడం, ప్రజా సమస్యలపై వార్తలు రాస్తే కక్ష సాధింపు ధోరణితో వ్యవహరించడం ప్రజాస్వామ్య విలువలకే విరుద్ధమని అని నిలదీశారు. జేఏసీ చైర్మన్, జర్నలిస్టు రాజు మాట్లాడుతూ.. జర్నలిస్టులు ఉన్నది ఉన్నట్లుగా వార్తలు రాస్తే కొందరికి మింగుడు పడటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం జర్నలిస్టులు చేసిన నేరమా? ప్రజల తరఫున ప్రశ్నించే హక్కును కాలరాసే అధికారం ఎవరిచ్చారని నిలదీశారు. మునుగనూరు ఇళ్ల స్థలాల కేటాయింపుల వ్యవహారంపై వార్తలు రాసినందుకే తనను లక్ష్యంగా చేసుకుని అనుచిత వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎమ్మెల్యే అనుచరులు, డ్రైవర్లు, అనధికారిక వ్యక్తులకు స్థలాలు కేటాయించారనే ఆరోపణలపై ప్రశ్నిస్తే జర్నలిస్టులను కించపరిచేలా మాట్లాడటం వెనుక ఆంతర్యమేమిటని నిలదీశారు. ఒక జర్నలిస్టును అవమానిస్తే అది ఒక్క వ్యక్తికి సంబంధించిన సమస్యగా చూడబోమని, యావత్ జర్నలిస్టు సమాజ ఆత్మగౌరవానికి సంబంధించిన అంశంగా పరిగణించి పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. జేఏసీ అధికార ప్రతినిధి, ప్రింట్ అండ్ డిజిటల్ మీడియా అసోసియేషన్ అధ్యక్షుడు, స్పెషల్ ఎడిషన్ తెలుగు దినపత్రిక సంపాదకులు ఎస్‌బీఎన్ చారి మాట్లాడుతూ.. జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని వెనకేసుకొచ్చే ధోరణిని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మానుకోవాలని హితవు పలికారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం గతంలో తాము చేసిన పోరాటాలు ఎమ్మెల్యేకు తెలియవా? అని ప్రశ్నించారు. ప్రజల సమస్యలను నిరంతరం ప్రభుత్వానికి చేరవేస్తూ, ఎండనకా వాననకా విధులు నిర్వహించే జర్నలిస్టులకు కనీసం సొంత గూడు కల్పించాలనే బాధ్యత ప్రజాప్రతినిధులకు లేదా? అని నిలదీశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో అప్పటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గంలో అప్పటి మంత్రి సబితా ఇంద్రారెడ్డి చొరవతో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కల్పించిన విషయాన్ని గుర్తుచేశారు. పక్క నియోజకవర్గాల్లో జర్నలిస్టులకు స్థలాలు కేటాయించినప్పుడు ఎల్బీనగర్ నియోజకవర్గంలో మాత్రం ఎందుకు అన్యాయం జరిగిందని ప్రశ్నించారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తే ఎమ్మెల్యే సొంత ఆస్తులు ఏమైనా కరిగిపోతాయా? అంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. మునుగనూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 90లో ఇళ్ల స్థలాల కేటాయింపుల వ్యవహారం అనేక ప్రశ్నలకు తావిస్తోందని జేఏసీ నాయకులు పేర్కొన్నారు. అర్హులైన జర్నలిస్టులను పక్కనపెట్టి ఎమ్మెల్యే అనుచరులు, డ్రైవర్లు, అనధికారిక పీఆర్ఓకు స్థలాలు కేటాయించారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అసలు స్థలాల కేటాయింపులకు ప్రాతిపదిక ఏమిటి? అర్హతలు ఎలా నిర్ణయించారు? జర్నలిస్టులను ఎందుకు విస్మరించారు? అనే అంశాలపై సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పష్టమైన సమాధానం చెప్పాలని కోరారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేయాల్సిన ప్రజాప్రతినిధులే వారి హక్కులను విస్మరిస్తే ఎవరిని ఆశ్రయించాలని ప్రశ్నించారు. జేఏసీ కళా సాంస్కృతిక సారథి కడారి శ్రీనివాస్ మాట్లాడుతూ.. తమ పోరాటం ఎవరికీ వ్యతిరేకం కాదని, జర్నలిస్టులకు న్యాయంగా దక్కాల్సిన హక్కుల కోసమేనని స్పష్టం చేశారు. జర్నలిస్టులకు కూడు, గుడ్డతోపాటు గూడు కూడా అత్యవసరమని పేర్కొన్నారు. నిత్యం ప్రజల సమస్యల కోసం పనిచేసే జర్నలిస్టుల కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. మునుగనూరు భూముల కేటాయింపులపై నెలకొన్న సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి జర్నలిస్టులతో స్నేహపూర్వక వాతావరణాన్ని కొనసాగించాలని సూచించారు.ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర అత్యంత కీలకమని, ప్రజల సమస్యలను ప్రశ్నించే జర్నలిస్టులను గౌరవించడం ప్రజాప్రతినిధుల కనీసబాధ్యతని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. అధికారంలో. ఉన్నవారిని ప్రశ్నించడం, పాలనలోని లోపాలను ఎత్తిచూపడం జర్నలిస్టుల విధి అని పేర్కొన్నారు. వార్తలు తమకు అనుకూలంగా ఉన్నప్పుడు జర్నలిస్టులను ప్రోత్సహించి, వ్యతిరేకంగా వచ్చినప్పుడు వ్యక్తిగత దూషణలకు దిగడం ఎంతమాత్రం సహించబోమన్నారు. ఒకరిపై జరిగిన అవమానాన్ని మరో జర్నలిస్టుకు జరిగిన అవమానంగా భావించి ఐక్యంగా నిలబడతామని ప్రకటించారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, హరికృష్ణ బహిరంగ క్షమాపణ చెప్పకపోతే జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని, అవసరమైతే రాష్ట్రవ్యాప్త జర్నలిస్టు సంఘాలను కలుపుకొని ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో న్యూస్ పేపర్స్ ఎడిటర్స్ రైట్స్ అసోసియేషన్ (నెరా) అధ్యక్షుడు కట్టా సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి లింగాల నరేందర్ గౌడ్, శనార్తి తెలంగాణ ఎడిటర్ పంతంగి భిక్షం గౌడ్, యువనేత పిలుపు ఎడిటర్ శ్రీను, మినిట్ టూ మినిట్ ఎడిటర్ సతీష్ కుమార్, ఆదర్శ అప్డేట్స్ తెలుగు దినపత్రిక ఎడిటర్ వెంకటరెడ్డి, మీడియా పోస్టర్ న్యూస్ అధినేత వరప్రసాద్, నవతెలంగాణ జర్నలిస్టు దుర్గేష్, విజయక్రాంతి జర్నలిస్టు ఆంజనేయులు, జర్నలిస్టులు శ్రీనివాస్, ముత్తయ్య ముదిరాజ్, పాపారావు, సకృ నాయక్, చంటి, భద్రయ్య, శ్రీకాంత్, శంకు యాదవ్, తదితర జేఏసీ సభ్యులు, జర్నలిస్టులు పాల్గొని నిరసనకు సంఘీభావం తెలిపారు. జర్నలిస్టుల ఆత్మగౌరవం, హక్కులు, సంక్షేమం విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే కృష్ణారావు.... పగటికలలు కనడం మానుకో

ప్రజలకు చేసిన మోసం బయటపెడతాం

కాంగ్రెస్ సీనియర్ నేత ఎం. యుగంధర్ రెడ్డి



బాలానగర్, నవంబర్ 23 (క్రైమ్ మిర్రర్) : రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనంటూ చెప్పుకుంటున్న కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పగటి కలలు కంటున్నాడని, కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి ఎద్దేవా చేశారు. రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో నీకే టికెట్ దొరుకుతుందో లేదో అది ముందు ఆలోచించు అని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ఎమ్మెల్యే ఎన్నికల్లో, గత కార్పొరేటర్ ఎన్నికల్లో కూకట్ పల్లి నియోజకవర్గం ప్రజలను ముఖ్యంగా బాలానగర్ ప్రాంత ప్రజలను ఏవిధంగా మోసం చేశావో త్వరలోనే బయటపెడతామని పేర్కొన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గంలో బండి రమేష్ నాయకత్వం బలపడుతున్న నేపథ్యంలో నీకు ఓర్వలేనితనం ఎక్కువైపోయి నీ ఉనికిని కాపాడుకోవడానికే చీప్ ట్రిక్స్ పాల్పడుతున్నావని పేర్కొన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గం ప్రజలకు మాయమాటలు చెప్పి మోసగించడంలో మొదటి స్థానంలో నువ్వే నిలుస్తావని తీవ్రంగా విమర్శించారు. ప్రజలను నిట్టనిలువునా ముంచిన ఎమ్మెల్యేగా పేరు ప్రఖ్యాతలు గడుస్తున్నావు, గమనించుకో? బినామీల పేరుమీద నువ్వు చేసే భూ దందా ఒక్కొక్కటిగా బయటపెడతాము, అందులో కేవలం ఒక్క ప్రశ్నకు మాత్రమే సమాధానం చెప్పు అని ప్రశ్నించారు. సంక్షేమ పథకాల అమలుతో ప్రజల్లో బలపడుతున్న కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజలు చూపుతిప్పుకోకుండా పక్కదారి పట్టించేందుకే ప్రభుత్వ భూముల అమ్మకం అనే అంశాన్ని నెత్తి కెక్కించుకున్నావని పేర్కొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు మంజూరయ్యేలా కృషి చేస్తాం: సర్పంచి వెంకటేశ్

శంకర్‌పల్లిలో 20 మందికి పింఛను పత్రాలు, రేషన్ కార్డుల పంపిణీ

మందమర్రి, నవంబర్ 22 (క్రైమ్ మిర్రర్) : పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని శంకర్‌పల్లి సర్పంచి పెరుమాండ్ల వెంకటేశ్ పేర్కొన్నారు. సోమవారం మందమర్రి మండలం శంకర్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, నూతనంగా మంజూరైన 20 మంది లబ్ధిదారులకు ఆసరా/చేయూత పింఛను మంజూరు పత్రాలు, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ జీవిత బీమా పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ.. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమన్నారు. గ్రామంలో ఇంకా ఎవరైనా అర్హులు మిగిలి ఉంటే వారి వివరాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పింఛన్లు, ఇతర పథకాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తమకు పింఛన్లు మంజూరు చేసిన ప్రభుత్వానికి, మంత్రి గడ్డం వివేక్‌కు లబ్ధిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హిమబిందు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పేదలకు సీఎం సహాయనిధి అండ: కౌన్సిలర్ శ్రీదేవి

బాధితుడికి రూ.60 వేల చెక్కు అందజేత



రామకృష్ణాపూర్ నవంబర్ 23 క్రైమ్ మిర్రర్): పేద, మధ్యతరగతి కుటుంబాలకు అనారోగ్య సమస్యలు, ప్రమాదాలు ఎదురైన సమయంలో ముఖ్యమంత్రి సహాయనిధి ఆర్థికంగా ఎంతో తోడ్పడుతుందని క్యాతనపల్లి పురపాలిక 18వ వార్డు కౌన్సిలర్ పల్లె శ్రీదేవి రాజు పేర్కొన్నారు. వార్డుకు చెందిన ఇళ్ల జయరాం వెన్నెముక సమస్యతో బాధపడుతుండగా ఇటీవల వైద్యులు శస్త్రచికిత్స చేశారు. వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.60 వేల చెక్కును సోమవారం కౌన్సిలర్ చేతుల మీదుగా బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బంది పడేవారికి ప్రభుత్వ సాయం ఆసరాగా నిలుస్తోందన్నారు. ఆర్థిక సాయం అందేలా కృషి చేసిన కౌన్సిలర్‌కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



ఓటర్ల హక్కులను కాపాడటంలో బూత్ లెవల్ ఏజెంట్ల పాత్ర ఎంతో కీలకం

కూకట్‌పల్లిలో బూత్ లెవల్ ఏజెంట్లకు కీలక బాధ్యతలు అప్పగించిన బండి రమేష్



కూకట్ పల్లి, నవంబర్ 23 (క్రైమ్ మిర్రర్) : కూకట్ పల్లి నియోజకవర్గ పరిధిలోని శ్రీ హేమ దుర్గాభవన్‌లోని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ ఆధ్వర్యంలో ముఖ్యమైన సమావేశం నిర్వహించారు.పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న బూత్ లెవల్ ఏజెంట్లకు వారి సంబంధిత పోలింగ్ బూతుల వారీగా బాధ్యతలు కేటాయిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, ప్రతి బూత్ లెవల్ ఏజెంట్ పార్టీ నిర్దేశించిన విధివిధానాలు, మార్గదర్శకాలకు అనుగుణంగా తమకు కేటాయించిన పోలింగ్ బూతుల పరిధిలో ఓటు హక్కు పరిరక్షణకు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఓటర్ల హక్కులను కాపాడటంలో బూత్ లెవల్ ఏజెంట్ల పాత్ర ఎంతో కీలకమని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.అనంతరం పీసీసీ ఆదేశాల మేరకు నియమితులైన కోఆర్డినేటర్ నర్సిరెడ్డి మాట్లాడుతూ, బూత్ లెవల్ ఏజెంట్లు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని, పార్టీ నాయకత్వం సూచించిన మార్గదర్శకాలను పాటిస్తూ ఓటు హక్కు పరిరక్షణ కోసం సమన్వయంతో పనిచేయాలని వివరించారు. ఈ సమావేశంలో అన్ని డివిజన్ల అధ్యక్షులు, మాజీ డివిజన్ అధ్యక్షులు, మహిళా అధ్యక్షురాళ్లు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.



రామప్పలో ప్రపంచ వారసత్వ వారోత్సవాలు

విద్యార్థులకు చిత్రలేఖన పోటీ

వెంకటాపూర్ (రామప్ప), క్రైమ్ మిర్రర్, నవంబర్ 23: ప్రపంచ వారసత్వ వారోత్సవాలు (World Heritage Week -- 2026) సందర్భంగా భారత పురావస్తు సర్వేక్షణ శాఖ (ASI), హైదరాబాద్ సర్కిల్ ఆధ్వర్యంలో నవంబర్ 19 నుంచి 25 వరకు నిర్వహిస్తున్న వేడుకల్లో భాగంగా సోమవారం చారిత్రక రామప్ప దేవాలయ ప్రాంగణంలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాలంపేట +ూనూ ప్రభుత్వ పాఠశాలకు చెందిన 20 మంది విద్యార్థులు పాల్గొని తమ చిత్రలేఖన ప్రతిభను ప్రదర్శించారు. ఈ ఏడాది ప్రపంచ వారసత్వ వారోత్సవాల థీమ్ "ూతీఱర్ం టశీతీ ఎవతీఱ్ఘస్త్రవ" ఆధారంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ తహసీల్దార్ ఎ. భానుప్రసాద్ హాజరయ్యారు. చిత్రలేఖన పోటీలో ప్రథమ బహుమతిని బి. అవినాష్, ద్వితీయ బహుమతిని డి. వర్షిత, తృతీయ బహుమతిని డి. వరుణ్ గెలుచుకున్నారు. విజేతలకు ముఖ్య అతిథి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. పోటీలో పాల్గొన్న విద్యార్థులందరికీ సర్టిఫికెట్లు, పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయి కృష్ణ ఈశరపు, అసిస్టెంట్ ఆర్కియాలజిస్ట్, ASI, అజిత్ ఎం.ఎస్., సీనియర్ కన్జర్వేషన్ అసిస్టెంట్, ASI, GPO బి. సురయ్య, అటెండర్ పి. శంకర్, ప్రభుత్వ పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం అనిల్ కుమార్, ఉపాధ్యాయులు భాను ప్రకాష్, కల్యాణి తదితరులు పాల్గొన్నారు. చారిత్రక కట్టడాలు, కళలు, సంస్కృతి, వారసత్వ సంపద పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.



క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
మంగళవారం 24-11-2026
5

అత్యాధునిక, క్లిష్ట శస్త్రచికిత్సలకు చిరునామాగా పాల్వంచ సీహెచ్‌సీ

వైద్య నైపుణ్యానికి నిలువుటద్దం.. మోకాలి మార్పిడిలో పాల్వంచ సీహెచ్‌సీ హ్యాట్రిక్

భద్రాద్రి కొత్తగూడెం నవంబర్ 23: ప్రభుత్వ వైద్యరంగంలో అత్యాధునిక వైద్య సేవలను సామాన్య ప్రజలకు చేరువ చేయడంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మరోసారి ప్రత్యేకతను చాటుకుంది. అనేక ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిర్వహించేందుకు వైద్యులు సైతం వెనుకాడే అత్యంత నైపుణ్యం అవసరమైన మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలను పాల్వంచ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) వైద్య బృందం వరుసగా విజయవంతంగా నిర్వహిస్తోంది. ఇప్పటికే రెండు శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేయగా, తాజాగా మూడో కేసును కూడా విజయవంతంగా నిర్వహించి హ్యాట్రిక్ సాధించింది. ఈ తరహా వినూత్న వైద్య సేవలకు గతంలోనే ఆసుపత్రికి రాష్ట్రస్థాయి అవార్డు లభించడం విశేషం. కొత్తగూడెంలోని రామాంజనేయ కాలనీకి చెందిన కటికల నాగేంద్రమ్మ (60) గత రెండేళ్లుగా కుడి మోకాలి తీవ్రమైన నొప్పితో బాధపడుతున్నారు. ఆమెకు పాల్వంచ సీహెచ్‌సీలో పూర్తి మోకాలు మార్పిడి శస్త్రచికిత్సను ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ వరుణ్ కుమార్ విజయవంతంగా నిర్వహించారు. అనస్థీషియాలజిస్ట్ డాక్టర్ రామ్ ప్రసాద్ అనస్థీషియా సేవలు అందించారు. ఆర్ఎంఓ డాక్టర్ సోమరాజు దొర సమన్వయం, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. ముక్కంటేశ్వరరావు పర్యవేక్షణలో శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తయింది. ఇదే ఆసుపత్రిలో ఇటీవల మరో క్లిష్టమైన హైరిస్క్ గర్భిణీ కేసును కూడా వైద్య బృందం సమర్థవంతంగా నిర్వహించి తల్లీబిడ్డ ఇద్దరినీ క్షేమంగా కాపాడింది. అత్యవసర పరిస్థితుల్లోనూ వైద్య నైపుణ్యం, సమయస్ఫూర్తితో చికిత్స అందించి సురక్షిత ప్రసవం చేయడం ఆసుపత్రిలో అందుతున్న నాణ్యమైన వైద్య సేవలకు మరో నిదర్శనంగా నిలిచింది. ఆర్థోపెడిక్



శస్త్రచికిత్సలతో పాటు గైనకాలజీ విభాగంలోనూ క్లిష్టమైన కేసులను విజయవంతంగా నిర్వహించడం పాల్వంచ సీహెచ్‌సీ వైద్య బృందం సామర్థ్యాన్ని చాటుతోంది. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. ముక్కంటేశ్వరరావు మాట్లాడుతూ.. ఆసుపత్రిలో పనిచేస్తున్న అంకితభావం కలిగిన వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఇతర ఉద్యోగుల సమష్టి కృషి వల్లే ఇలాంటి క్లిష్టమైన శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించగలుగుతున్నామని తెలిపారు. వైద్య బృందం నిబద్ధత, సేవాభావమే ఆసుపత్రి సాధిస్తున్న విజయాలకు ప్రధాన కారణమని పేర్కొన్నారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ రవి బాబు మాట్లాడుతూ.. సీహెచ్‌సీ స్థాయిలోనే ఇంతటి అత్యున్నత నైపుణ్యం అవసరమైన శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించడం ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది అంకితభావానికి నిదర్శనమన్నారు. ప్రభుత్వ వైద్య బృందాలు సమర్థవంతంగా పనిచేస్తే పేద ప్రజలకు కూడా అత్యాధునిక వైద్య సేవలు అందించవచ్చని పాల్వంచ సీహెచ్‌సీ నిరూపిస్తోందని ప్రశంసించారు. ఇదే మోకాలి మార్పిడి శస్త్రచికిత్సను ప్రైవేటు ఆసుపత్రిలో చేయించుకుంటే సుమారు రూ.1.50 లక్షల వరకు ఖర్చయ్యేదని, ప్రభుత్వ ఆసుపత్రిలోనే చికిత్స అందడం ద్వారా రోగికి భారీ ఆర్థిక భారం తప్పిందని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్న పాల్వంచ సీహెచ్‌సీ వైద్యులు, సిబ్బందిని అభినందించారు.

నమ్మకంతో వచ్చాం.. కుటుంబ సభ్యులు.

గతంలో ఇదే ఆసుపత్రిలో నిర్వహించిన మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతం కావడం, వైద్యులపై నమ్మకం కలగడంతో తమ కుటుంబ సభ్యురాలికి కూడా ఇక్కడే శస్త్రచికిత్స చేయించుకోవాలని నిర్ణయించుకున్నామని రోగి కుటుంబ సభ్యులు తెలిపారు. తమకు నాణ్యమైన వైద్య సేవలు అందించిన పాల్వంచ ఆసుపత్రి వైద్యులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని నిరూపిస్తూ, ప్రజల్లో ప్రభుత్వ వైద్య వ్యవస్థపై నమ్మకాన్ని మరింత పెంచేలా పాల్వంచ సీహెచ్‌సీ వైద్య బృందం చేస్తున్న కృషి అభినందనీయమని ప్రజలు కొనియాడారు.

ఇన్ముల‌నర్వ లేఅవుట్ ఈ-వేలానికి విశేష స్పందన

45 నివాస ప్లాట్ల విక్రయంతో హెచ్ఎండీఏకు రూ. 6.67 కోట్ల ఆదాయం..

గజానికి గరిష్ఠంగా రూ. 19 వేల ధర

హైదరాబాద్(క్రైమ్ మిర్రర్): హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) ఆధ్వర్యంలో ఇన్ముల‌నర్వ లేఅవుట్‌లో నిర్వహించిన నివాస ప్లాట్ల ఈ-వేలానికి కొనుగోలుదారులు, పెట్టుబడిదారుల నుంచి విశేష స్పందన లభించింది. నవంబర్ 23న నిర్వహించిన ఈ వేలంలో మొత్తం 45 నివాస ప్లాట్లు విజయవంతంగా విక్రయమయ్యాయి. వీటి ద్వారా హెచ్ఎండీఏకు సుమారు రూ. 6.67 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ-వేలంలో చదరపు గజానికి గరిష్ఠంగా రూ. 19,000 ధర పలకగా, సగటు వెయిటెడ్ ధర చదరపు గజానికి రూ. 16,345గా నమోదైంది. ప్లాట్ల కొనుగోలుకు పలువురు ఆసక్తి చూపడంతో వేలం ప్రక్రియకు మంచి స్పందన లభించినట్లు అధికారులు వెల్లడించారు. ఇన్ముల‌నర్వ లేఅవుట్‌పై పెరుగుతున్న ఆసక్తి, అక్కడి స్థిరాస్తి పెట్టుబడి అవకాశాలకు ఈ వేలం ఫలితాలు నిదర్శనంగా నిలుస్తున్నాయి. హెచ్ఎండీఏ నిర్వహిస్తున్న పారదర్శక ఈ-వేలం ప్రక్రియ ద్వారా ప్రభుత్వ ఆదాయం పెరగడంతో పాటు, కొనుగోలుదారులకు ప్లాట్ల కొనుగోలుకు అవకాశం లభిస్తోందని ఈ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి.

క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595

అర్హులైన ప్రతి కుటుంబ సభ్యుడు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంలో నమోదు చేసుకోవాలి

పొద్దుటూరు సర్పంచ్ లక్ష్మీ నరసింహ బొల్లారం
వెంకటరెడ్డి శంకర్పల్లి పి ఎ సిఎస్ చైర్మన్, శంకర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు .



క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి : పొద్దుటూరు గ్రామంలో ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంలో అర్హులైన ప్రతి కుటుంబ సభ్యుడు తమ పేర్లను నమోదు చేసుకోవాలని గ్రామ సర్పంచ్ లక్ష్మీ నరసింహ గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం పొద్దుటూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన నమోదు కార్యక్రమంలో సర్పంచ్ మాట్లాడుతూ, ఈ పథకానికి 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన వారు అర్హులని తెలిపారు. నమోదు చేసుకునే సమయంలో కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు, రేషన్ కార్డు, మొబైల్ ఫోన్ నంబర్ తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శంకర్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొల్లారం వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రజల కుటుంబ భద్రత కోసం ప్రవేశపెట్టిన ఈ బీమా పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామ ప్రజలకు ఈ పథకంపై అవగాహన కల్పించి, అర్హులందరూ నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్హులైన గ్రామ ప్రజలు అవసరమైన పత్రాలతో గ్రామపంచాయతీ కార్యాలయానికి వచ్చి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సర్పంచ్ లక్ష్మీ నరసింహ కోరారు. కుటుంబ భద్రతకు ఎంతో ఉపయోగకరమైన ఈ పథకంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పొద్దుటూరు సర్పంచ్ బండ లక్ష్మీ నరసింహ , బొల్లారం వెంకట్ రెడ్డి శంకర్పల్లి పిఎసిఎస్ చైర్మన్ శంకరపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు . ఉప సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి , పంచాయతీ సెక్రెటరీ, శ్రీనివాస్,వార్డు సభ్యులు జి పి బిల్ కలెక్టర్,గ్రామ పెద్దలు గ్రామస్తులు పాల్గొన్నారు

సింగరేణి సేవా సమితి వృత్తి శిక్షణ కోర్సుల శిక్షకుల ఎంపికకు ఇంటర్వ్యూలు



మందమర్రి టౌన్ నవంబర్ 23 క్రైమ్ మిర్రర్: సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న వృత్తి విద్యా శిక్షణ కోర్సులకు సంబంధించి శిక్షకుల ఎంపిక కోసం సోమవారం మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించామని డీ జీఎం పర్సనల్ సీహెచ్.అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2026-27 విద్యా సంవత్సరానికి గాను టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, కంప్యూటర్ శిక్షణ విభాగాల్లో మొత్తం ఆరు కోర్సులు, కేంద్రాలకు సంబంధించి శిక్షకులను ఎంపిక చేసేందుకు ఈ ప్రక్రియ చేపట్టామని అన్నారు. ఇందులో టైలరింగ్‌కు రెండు, ఫ్యాషన్ డిజైనింగ్‌కు రెండు, బ్యూటీషియన్‌కు ఒకటి, కంప్యూటర్ శిక్షణకు ఒక కేంద్రం చొప్పున కేటాయించామని తెలిపారు.ఈ పోస్టుల కోసం మొత్తం 18 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, వారికి ఇంటర్వ్యూలు నిర్వహించామని పేర్కొన్నారు.సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న వృత్తి శిక్షణ కోర్సుల ద్వారా ఎంతోమంది స్థానికులు వివిధ రంగాల్లో నైపుణ్యాలను పెంపొందించుకుని స్వయం ఉపాధి పొందుతున్నారని తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఫ్యాకల్టీ ఎంపిక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించామని పేర్కొన్నారు. ఎంపికైన ఆరుగురు అభ్యర్థులు త్వరలో ప్రారంభం కానున్న శిక్షణ తరగతులకు బోధకులుగా నియమితులవుతారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం జి.ఎల్. ప్రసాద్, ఏజీఎం (ఎఫ్ అండ్ ఏ) ఆర్.వి.ఎస్.ఆర్.కె. ప్రసాద్, డీజీఎం (ఐఈడీ) కిరణ్ కుమార్, సీనియర్ పీవో ఆర్. సత్యనారాయణ పాల్గొన్నారు.



సింగరేణి శిక్షకుల ఎంపికకు ఇంటర్వ్యూలు

పారదర్శకంగా ప్రక్రియ పూర్తి చేశాం: డీజీఎం అశోక్

మందమర్రి, నవంబర్ 23 (క్రైమ్ మిర్రర్): సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి నిర్వహించనున్న వృత్తి విద్యా శిక్షణ కోర్సుల శిక్షకుల ఎంపిక కోసం సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ ప్రక్రియ జరిగింది. టైలరింగ్ (2), ఫ్యాషన్ డిజైనింగ్ (2), బ్యూటీషియన్ (1), కంప్యూటర్ శిక్షణ (1) విభాగాల్లో మొత్తం ఆరు పోస్టులకు గాను 18 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, కమిటీ సభ్యులు వారికి ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీఎం (పర్సనల్) సీహెచ్. అశోక్ మాట్లాడుతూ.. సేవా సమితి ద్వారా అందిస్తున్న వృత్తి శిక్షణ కోర్సులతో ఎంతో మంది స్థానికులు నైపుణ్యాలను పెంపొందించుకుని స్వయం ఉపాధి పొందుతున్నారన్నారు. పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ పూర్తి చేశామని, ఎంపికైన ఆరుగురు త్వరలో ప్రారంభమయ్యే తరగతులకు శిక్షకులుగా వ్యవహరిస్తారని తెలిపారు. ఎస్వోటు జీఎం జి.ఎల్. ప్రసాద్, ఏజీఎం (ఎఫ్ అండ్ ఏ) ఆర్.వి.ఎస్.ఆర్.కె. ప్రసాద్, డీజీఎం (ఐఈడీ) కిరణ్ కుమార్, సీనియర్ పీవో ఆర్. సత్యనారాయణ తదితరులు ఇంటర్వ్యూ ప్రక్రియను పర్యవేక్షించారు.

కార్తీక పౌర్ణమి ఆధ్యాత్మిక వెలుగులు ప్రతి ఒక్కరి జీవితాల్లో నిండాలి -- డా. చినుకని శివ ప్రసాద్

క్రైమ్ మిర్రర్, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో:- కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ ప్రజలకు సహస్ర ఫౌండేషన్ చైర్మన్ డా . చినుకని శివ ప్రసాద్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. కార్తీక పౌర్ణమి ఆధ్యాత్మిక చైతన్యానికి, భక్తి భావానికి, ధర్మబద్ధమైన జీవనానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఈ పవిత్రమైన రోజున శివారాధన, దీపారాధన చేయడం ద్వారా ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక భావన, సానుకూల ఆలోచనలు పెంపొందాలని ఆకాంక్షించారు. దీపాల వెలుగుల మాదిరిగా ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని, సమాజంలో మానవత్వం, ఐక్యత, సోదరభావం మరింత బలపడాలని ఆకాంక్షించారు.

జీతాలను వెంటనే విడుదల చేయండి

ఎంపీడీవో కు ఫీల్డ్ అసిస్టెంట్ల వినతి పత్రం.

కేశంపేట,(క్రైమ్ మిర్రర్): నెలల తరబడి జీతాలు అందగా ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నామని వెంటనే జీతాలను విడుదల చేసి మమ్మల్ని ఆదుకోవాలని ఉపాధి హామీ పథకం క్షేత్రస్థాయి సిబ్బంది (ఫీల్డ్ అసిస్టెంట్లు) సోమవారం ఎంపీడీవో రవిచంద్ర కుమార్ రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. పెండింగ్ జీతాల సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు పరిష్కారం లభించలేదని ఫీల్డ్ అసిస్టెంట్లు తమ వినతిపత్రంలో పేర్కొన్నారు. జీతాలు లేకుండా క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించడం,ప్రయాణ ఖర్చులు భరించడం కష్టంగా మారిందని,ఇంటి పోషణ భారంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, కుటుంబ అవసరాలు తీర్చుకోవడానికి అప్పులపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొందని వాపోయారు. తమ సమస్యను అధికారులు సానుకూలంగా స్పందించి, పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు.ఈ కార్యక్రమంలో వహీద్, మహేష్, శ్రీనివాసులు, యాదయ్య, శేఖర్, జగన్ నరసింహ, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
6 మంగళవారం 24-11-2026

అభివృద్ధి పనులతో కల్వకుర్తి నియోజకవర్గంలో జోరు..

- కల్వకుర్తిలో ఫైర్ స్టేషన్ ప్రారంభం
- విద్యుత్ లైన్ మార్పునకు శంకుస్థాపన
- కల్వకుర్తి వెల్దండ పీఏసీఎస్ చైర్మన్ల ప్రమాణ స్వీకారం
- వెల్దండలో రూ.5.60 కోట్ల పనులకు శ్రీకారం





క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి: కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కల్వకుర్తి పట్టణంతో పాటు వెల్దండ మండల పరిధిలో విస్తృతంగా పర్యటించి పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు, నూతన పీఏసీఎస్ పాలకవర్గాల ప్రమాణ స్వీకార కార్యక్రమాలకు హాజరయ్యారు. ముందుగా కల్వకుర్తి పట్టణంలో నూతనంగా నిర్మించిన ఫైర్ స్టేషన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం విద్యానగర్, తిలక్‌నగర్ ప్రాంతాల్లో నివాస గృహాల మీదుగా వెళ్తున్న 33 కేవీ సిర్సనగండ్ల ఫీడర్ విద్యుత్ లైన్‌ను ప్రత్యామ్నాయ మార్గంలోకి మార్చేందుకు చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేశారు. ఈ పనులు పూర్తయితే స్థానిక ప్రజలకు విద్యుత్ లైన్ల వల్ల ఎదురవుతున్న ఇబ్బందులు తొలగనున్నాయి. అనంతరం మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రంతో పాటు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నూతన పీఏసీఎస్ పాలకవర్గాలకు ఎమ్మెల్యే అభినందనలు...

కల్వకుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన చైర్మన్ శ్రీపురం హరీశ్వర్ రెడ్డి, పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. అదేవిధంగా వెల్దండ మండల పీఏసీఎస్ నూతన చైర్మన్ ఎన్నం భూపతి రెడ్డి, పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇరు సంఘాల నూతన పాలకవర్గ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

వెల్దండ మండలంలో రూ.5.60 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం...

వెల్దండ మండల పరిధిలోని పలు గ్రామాలు, తండాల్లో పర్యటించిన ఎమ్మెల్యే దాదాపు రూ.5.60 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అలాగే పూర్తయిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఒకే రోజు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రజా అవసరాలు, గ్రామీణ ప్రాంతాల మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా నియోజకవర్గ మండల స్థాయి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



29న అయ్యప్ప ఆలయ నిర్మాణానికి భూమిపూజ: శ్రీశ్రీశ్రీ శంకరానంద స్వామి

క్రైమ్ మిర్రర్,యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో:- సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని హరిహర క్షేత్రం అయ్యప్ప స్వామి దేవాలయంలో శ్రీ మణికంఠ సన్నిధానం ఆధ్వర్యంలో నూతన ఆలయ నిర్మాణ శంకుస్థాపన, భూమిపూజ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి అన్నపూర్ణేశ్వరి ఆశ్రమ వ్యవస్థాపకులు శ్రీశ్రీశ్రీ శంకరానంద స్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ ఈ నెల 29వ తేదీ ఆదివారం నిర్వహించనున్న ఆలయ శంకుస్థాపన, భూమిపూజ కార్యక్రమానికి గ్రామ ప్రజలు, అయ్యప్ప భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో గురుస్వాములు సోనబోయిన ఐలయ్య, చిలువేరు జంగయ్య, బాలగోని బాలరాజు, తెలంగాణ బిక్షం, చిలువేరు సాయిబాబా, నీళ్ల శ్రీశైలం, బొడ్డుపల్లి కృష్ణ, ఏపూరి మహేష్, దూసరి శ్రీశైలం, గవ్వల జంగయ్య, సురేష్, గట్టు శీను, గణేష్, నీళ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 4వ వార్డ్ సభ్యులు సూరపల్లి వెంకటేష్ నేత జన్మదిన వేడుకలు



క్రైమ్ మిర్రర్,యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో:- సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన 4వ వార్డ్ సభ్యులు సూరపల్లి వెంకటేష్ నేత జన్మదిన వేడుకలు కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోన్ రెడ్డి నరసింహ, యువజన కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి ఉప్పల నాగరాజు, ఆంధ్రప్రభ రిపోర్టర్ కొండ శ్రీకాంత్ గౌడ్, క్రైమ్ మిర్రర్ రిపోర్టర్ ఉప్పల వెంకటేష్, ప్రభాత సూర్య రిపోర్టర్ చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు సంగిశెట్టి ధనంజయ నేత, మాజీ వార్డు సభ్యులు మహమ్మద్ ముస్తఫా ఖాన్, ఎండి నజ్జు ఖురేసి, వడ్డేపల్లి శివప్రసాద్, బానోతు కిరణ్ నాయక్, ఎండి సాధక్ ఖురేసి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుడి ప్రాణాలు కాపాడిన కాలనీవాసికి ఘన సన్మానం

సకాలంలో సీపీఆర్ చేసి యాలాల ప్రవీణ్‌కు పునర్జన్మనిచ్చిన సుందర్‌రావు



గండిపేట(క్రైమ్ మిర్రర్): విధి నిర్వహణలో విద్యుత్ షాక్‌కు గురై ప్రాణాపాయ స్థితికి చేరుకున్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుడు యాలాల ప్రవీణ్ ప్రాణాలను సకాలంలో సీపీఆర్ చేసి కాపాడిన ఫ్రెండ్స్ కాలనీ వాసి సుందర్‌రావును ప్రవీణ్ కుటుంబ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ నెల 8వ తేదీన నార్సింగి సర్కిల్-45 పరిధిలోని నెక్నాంపూర్ డివిజన్ ఫ్రెండ్స్ కాలనీలో పారిశుద్ధ్య విధులు నిర్వహిస్తున్న ప్రవీణ్ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. విద్యుత్ తీగకు అతుక్కుపోయి అపస్మారక స్థితిలో పడిపోయిన ఆయన గుండె స్పందన ఆగిపోయిన పరిస్థితిలో ఉన్నట్లు గుర్తించారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న కాలనీ వాసి సుందర్‌రావు వెంటనే స్పందించి సీపీఆర్ నిర్వహించడంతో ప్రవీణ్ ప్రాణాలు దక్కాయి. అనంతరం ఆయనను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స అనంతరం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన ప్రవీణ్ కుటుంబ సభ్యులు, మణికొండ మాజీ సర్పంచ్ కాలాల నరేష్‌తో కలిసి సుందర్‌రావును శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఆపద సమయంలో సమయస్ఫూర్తితో స్పందించి ప్రాణాలు కాపాడినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివాజీనగర్ వాసులతో పాటు పలువురు స్థానికులు పాల్గొన్నారు. సకాలంలో స్పందించి సీపీఆర్ చేయడం ద్వారా ఒక వ్యక్తి ప్రాణాలను కాపాడిన సుందర్‌రావు సేవలను కాలనీవాసులు అభినందించారు.

ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవలందిస్తా...

గిరిజన సంఘం మండల అధ్యక్షుడు రాత్లావత్ అజిత్ నాయక్



క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (వెల్దండ) : మండల ప్రజలతో పాటు గిరిజన కులస్తులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని గిరిజన సంఘం వెల్దండ మండల అధ్యక్షుడు రాత్లావత్ అజిత్ నాయక్ తెలిపారు. ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాల ద్వారా సమాజ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. సోమవారం వెల్దండ మండలంలో నిర్వహించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో అజిత్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ ఎన్నం భూపతి రెడ్డి, పాలకవర్గ సభ్యులను శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన పాలకవర్గం రైతుల సంక్షేమానికి, సహకార సంఘం అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి వెల్దండ మండల పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తూ ప్రజల అవసరాలు, స్థానిక సమస్యలపై దృష్టి సారించారు.ఈ సందర్భంగా అజిత్ నాయక్ మాట్లాడుతూ... గిరిజన కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి కృషి చేస్తానని తెలిపారు. గిరిజనుల హక్కులు, సంక్షేమం, విద్య, వైద్యం వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. ఇందులో భాగంగా త్వరలోనే ఉమ్మడి పోతేపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ వైద్య శిబిరం ద్వారా గ్రామీణ ప్రజలకు వైద్య పరీక్షలు, ఆరోగ్య సలహాలు అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యంగా ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్య సేవలు పొందలేని పేద కుటుంబాలకు ఈ శిబిరం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.ప్రజాసేవే లక్ష్యంగా ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటూ, గిరిజనులు, పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని రాత్లావత్ అజిత్ నాయక్ స్పష్టం చేశారు.

మాజీ రౌడీషీటర్ మూర్తుజా అలీ దారుణ హత్య

కత్తులు, తల్వార్లతో మెడ, ముఖంపై దాడి.. చికిత్స పొందుతూ మృతి



గండిపేట(క్రైమ్ మిర్రర్): మాజీ రౌడీషీటర్ మూర్తుజా అలీ అలియాస్ మూర్తుజా పైల్వాన్ దారుణ హత్యకు గురయ్యాడు. ప్రత్యర్థులు కత్తులు, తల్వార్లతో ఆయనపై విచక్షణారహితంగా దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అత్తాపూర్‌లోని జర్మన్‌టెన్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సమాచారం. వివరాల ప్రకారం.. పాత కక్షలు, ప్రత్యర్థుల మధ్య ఆధిపత్య పోరు నేపథ్యంలో ఈ దాడి జరిగినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. దుండగులు మూర్తుజా అలీని లక్ష్యంగా చేసుకుని పదునైన ఆయుధాలతో మెడ, ముఖంపై దాడి చేసినట్లు సమాచారం. తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో పడిపోయిన ఆయనను ఆసుపత్రికి తరలించారు. ఘటన విషయం తెలుసుకున్న ఆయన అనుచరులు పెద్ద సంఖ్యలో ఆసుపత్రికి చేరుకోవడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మూర్తుజా అలీపై గతంలో పలు హత్య కేసులు నమోదైనట్లు సమాచారం. 2015లో మీరాలం ట్యాంక్ వద్ద జరిగిన అసద్ హత్య కేసులోనూ ఆయన పేరు వినిపించింది. 2021లో ఆయనపై హత్యకు కుట్ర జరిగినట్లు కూడా పోలీసు రికార్డుల్లో ఉన్నట్లు తెలుస్తోంది. తాజా హత్యకు పాత కక్షలే కారణమా? ప్రత్యర్థుల మధ్య ఆధిపత్య పోరే నేపథ్యమా? లేక మరేదైనా కారణం ఉందా? అనే కోణాల్లో చర్చ జరుగుతోంది. దాడికి పాల్పడిన నిందితులు ఎవరు, హత్య వెనుక అసలు కారణాలేమిటనే అంశాలపై పోలీసుల దర్యాప్తులో పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది.

ప్రమాద బీమా ద్వారా మృతుడి కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక సహాయం

గాయత్రి బ్యాంకు సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలి



మందమర్రి టౌన్ నవంబర్ 23 క్రైమ్ మిర్రర్: ది గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు మంచిర్యాల శాఖ ఖాతాదారుడైన తోగిటి శివ ప్రమాదవశాత్తు మరణించడంతో, ఆయనకు గాయత్రి నిర్భయ సేవింగ్స్ ఖాతా ద్వారా కల్పించిన ప్రమాద బీమా సౌకర్యం కింద రూ.2 లక్షల బీమా చెక్కును ఆయన తల్లి తోగిటి నాగకు మంచిర్యాల ఎంఆర్ఓ రఫతుల్లా హుస్సేన్ చేతుల మీదుగా సోమవారం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ కేలేటి ప్రవీణ్ మాట్లాడుతూ రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని సంవత్సరానికి 10.50 శాతం వడ్డీ రేటుతో వ్యవసాయ రుణాలను అందిస్తున్నట్లు తెలిపారు. మంచిర్యాల పరిసర గ్రామాల్లో బ్యాంకింగ్ కరస్పాండెంట్లను నియమించడం ద్వారా పెన్షనర్లు, ఇతర ఖాతాదారులకు గ్రామస్థాయిలోనే బ్యాంకింగ్ లావాదేవీల సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. మంచిర్యాల పట్టణంతో పాటు పరిసర ప్రాంత ప్రజల నగదు అవసరాలను తీర్చేందుకు 24 గంటల పాటు ఏటీఎంలలో నగదు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. బంగారు ఆభరణాలపై తక్కువ వడ్డీతో, గ్రామకు గరిష్ఠంగా రూ.9,000 వరకు రుణాలు అందిస్తున్నట్లు వెల్లడించారు.అలాగే పొదుపు ఖాతాలు ప్రారంభించుకునే ఖాతాదారులకు అవసరమైన ఫోటోలు, జిరాక్స్ కాపీలను బ్యాంకు తరఫున ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. వ్యాపారస్తుల వ్యాపారాభివృద్ధికి రుణ సదుపాయాలు కల్పిస్తున్నామని, కిసాన్ వికాస్ పత్రాలు, పోస్టాఫీస్ డిపాజిట్లపై కూడా 10 శాతం వార్షిక వడ్డీ రేటుతో రుణాలు అందిస్తున్నట్లు వివరించారు.బ్యాంకు అందిస్తున్న ప్రమాద బీమా, వ్యవసాయ రుణాలు, బంగారు రుణాలు, వ్యాపార రుణాలు, ఇతర బ్యాంకింగ్ సదుపాయాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ జి.సుధాకర్, సీనియర్ ఆఫీసర్ ఆర్. రమేష్, జూనియర్ ఆఫీసర్లు ఇ. శివకుమార్, ఎస్. సాగర్ తదితరులు పాల్గొన్నారు.

అగ్రి వర్సిటీలో మరో రెండు కొత్త డిగ్రీ కోర్సులు

హెచ్ఐటీ, బిట్స్ సహకారంతో అగ్రికల్చర్‌లో ఏఐ కోర్సు..

జనవరి నుంచి రైతు భరోసా యాత్రలు



గండిపేట(క్రైమ్ మిర్రర్): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను అందించడంతో పాటు, ఉపాధి అవకాశాలను పెంపొందించే దిశగా మరో రెండు కొత్త డిగ్రీ కోర్సులను ప్రారంభించేందుకు నిర్ణయం తీసుకున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి నాలుగేళ్ల బీటెక్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్ అగ్రికల్చర్), బీఎస్సీ (ఫుడ్ సైన్స్ అండ్ డైటెటిక్స్) కోర్సులను అందుబాటులోకి తీసుకురావాలని విశ్వవిద్యాలయ అకడమిక్ కౌన్సిల్ తీర్మానించింది. మరోవైపు రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులకు అవగాహన, భరోసా కల్పించేందుకు జనవరి, ఫిబ్రవరి నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా రైతు భరోసా యాత్రలు నిర్వహించాలని నిర్ణయించింది. రాజేంద్రనగర్‌లోని విశ్వవిద్యాలయ ఆడిటోరియం కమిటీ హాల్‌లో సోమవారం నిర్వహించిన 119వ అకడమిక్ కౌన్సిల్ సమావేశానికి ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య అధ్యక్షత వహించారు. హైబ్రిడ్ విధానంలో జరిగిన ఈ సమావేశంలో విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు, వివిధ విభాగాల అధిపతులు, అసోసియేట్ డీన్లు పాల్గొన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ డాక్టర్ కుమార్ మొలుగరం, ఐసీఏఆర్-ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ తారా సత్యావతి, ఐసీఏఆర్-ఐఐఆర్ఆర్ మాజీ శాస్త్రవేత్త డాక్టర్ ఆర్. మహేందర్ కుమార్, న్యూఢిల్లీ ఐఏఆర్ఐ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ సూరా నరేష్ కుమార్ తదితరులు పాల్గొని పలు కీలక అంశాలపై చర్చించారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా వ్యవసాయ విద్యలో నూతన కోర్సులను ప్రవేశపెట్టాల్సిన అవసరాన్ని గుర్తించిన అకడమిక్ కౌన్సిల్ కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ ఐఐటీ, బిట్స్ సంస్థల సహకారంతో నాలుగేళ్ల బీటెక్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్ అగ్రికల్చర్) కోర్సును ప్రారంభించాలని నిర్ణయించింది. వ్యవసాయ రంగంలో కృత్రిమ మేధస్సు వినియోగం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు నైపుణ్యాలు అందించడం ఈ కోర్సు ప్రధాన లక్ష్యంగా ఉండనుంది. అదేవిధంగా ఆహార శాస్త్రం, పోషకాహార రంగాల్లో పెరుగుతున్న అవసరాలు, మార్కెట్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని బీఎస్సీ (ఫుడ్ సైన్స్ అండ్ డైటెటిక్స్) కోర్సును కూడా ప్రారంభించనున్నారు. ఈ రెండు కోర్సులను రాజేంద్రనగర్ క్యాంపస్‌లోనే నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన సిలబస్, నియమ నిబంధనలు, ఇతర విధివిధానాలను రూపొందించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని తీర్మానించింది. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ రంగం ఎదుర్కొనే వాతావరణ పరిస్థితులపై రైతులకు ముందస్తు అవగాహన కల్పించడంతో పాటు, పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, శాస్త్రీయ పద్ధతులపై సూచనలు అందించేందుకు విశ్వవిద్యాలయం ప్రత్యేక కార్యాచరణకు సిద్ధమవుతోంది. వ్యవసాయ శాఖ సహకారంతో వ్యవసాయ శాస్త్రవేత్తలు, విద్యార్థులను భాగస్వాములుగా చేస్తూ జనవరి, ఫిబ్రవరి నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా రైతు భరోసా యాత్రలు నిర్వహించాలని అకడమిక్ కౌన్సిల్ నిర్ణయించింది. ఈ యాత్రల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో రైతులను నేరుగా కలిసి వాతావరణ మార్పుల ప్రభావం, పంటల ఎంపిక, నీటి వినియోగం, సాగు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించనున్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ రైతులు నష్టాలను తగ్గించుకునేలా శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు అందించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య వివరించారు. ఒకవైపు ఆధునిక సాంకేతికతతో కూడిన కొత్త కోర్సులు, మరోవైపు క్షేత్రస్థాయిలో రైతులకు శాస్త్రీయ పరిజ్ఞానాన్ని చేరవేసే రైతు భరోసా యాత్రల నిర్ణయాలతో వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యా, పరిశోధన, రైతు సంక్షేమ రంగాల్లో మరింత క్రియాశీలకంగా ముందుకు సాగేందుకు కార్యాచరణ రూపొందిస్తోంది.

బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం కూల్చివేతపై ధర్మారెడ్డి ఆగ్రహం

తెలంగాణపై మళ్లీ ఆంధ్ర పాలకుల పెత్తనం మొదలైందంటూ ఆరోపణలు.. రాజకీయ కక్షతోనే కార్యాలయాన్ని కూల్చివేశారని విమర్శ





గండిపేట(క్రైమ్ మిర్రర్): తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు గడుస్తున్నప్పటికీ రాష్ట్రంపై ఆంధ్ర ప్రాంత పాలకుల పెత్తనం మళ్లీ మొదలైందని బీఆర్ఎస్ రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిల్ ఇన్‌చార్జి పొరెడ్డి ధర్మారెడ్డి ఆరోపించారు. అత్తాపూర్ సర్కిల్ పరిధిలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న తన పార్టీ కార్యాలయాన్ని అక్రమంగా కూల్చివేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయంగా తన ఎదుగుదలను అడ్డుకోవాలనే ఉద్దేశంతోనే అధికార పార్టీ నాయకులు, ఆంధ్ర ప్రాంతానికి చెందిన కొందరు వ్యక్తులు కలిసి కుట్రపూరితంగా ఈ చర్యకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ సందర్భంగా పొరెడ్డి ధర్మారెడ్డి మాట్లాడుతూ.. రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిల్ పరిధిలో బీఆర్ఎస్ పార్టీకి ప్రధాన కేంద్రంగా కొనసాగుతున్న కార్యాలయాన్ని కూల్చివేయడం వెనుక రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయని పేర్కొన్నారు. తన రాజకీయ ఎదుగుదలను, స్థానికంగా పార్టీ బలోపేతానికి చేస్తున్న కృషిని ఓర్వలేక కొందరు నాయకులు అడ్డంకులు సృష్టిస్తున్నారని విమర్శించారు. తన పార్టీ కార్యాలయానికి సమీపంలో నివసించే ఆంధ్ర ప్రాంతానికి చెందిన ఓ మహిళ, గతంలో టీఆర్ఎస్ పార్టీపై ఉన్న వ్యతిరేకతతో కార్యాలయాన్ని తొలగించేందుకు ప్రయత్నించారని ఆయన ఆరోపించారు. ఈ క్రమంలో న్యాయస్థానాన్ని ఆశ్రయించి స్టే ఆర్డర్ తీసుకువచ్చి, ఆంధ్ర ప్రాంతానికి చెందిన కొందరు రాజకీయ నాయకుల ద్వారా తెలంగాణలోని అధికార పార్టీ నాయకులపై ఒత్తిడి తీసుకొచ్చారని పేర్కొన్నారు. ఆ ఒత్తిళ్లకు స్థానిక అధికార పార్టీ నాయకులు కూడా సహకరించి, అధికార యంత్రాంగంపై ప్రభావం చూపి కార్యాలయాన్ని కూల్చివేయించారని ధర్మారెడ్డి ఆరోపించారు. అయితే, ఈ ఆరోపణలపై సంబంధిత వ్యక్తులు, అధికారుల వివరణ తెలియాల్సి ఉంది. తాను బీఆర్ఎస్ పార్టీలో కొనసాగుతూ స్థానికంగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న నేపథ్యంలో పలుమార్లు పార్టీ మారాలని కొందరు అధికార పార్టీ నాయకులు ఒత్తిడి తీసుకొచ్చారని ధర్మారెడ్డి వెల్లడించారు. అయినప్పటికీ పార్టీ మారేందుకు అంగీకరించకపోవడంతో తనను రాజకీయంగా ఇబ్బందులకు గురిచేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా తాను బీఆర్ఎస్ పార్టీని వీడే ప్రసక్తే లేదని పొరెడ్డి ధర్మారెడ్డి స్పష్టం చేశారు. చచ్చినా బతికినా బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని, ఇలాంటి కక్ష సాధింపు చర్యలకు భయపడే ప్రసక్తి లేదని అన్నారు. మరో రెండేళ్ల తర్వాత తమ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అప్పుడు తనపై కక్ష సాధింపు చర్యలకు బాధ్యులైన ప్రతి ఒక్కరికీ చట్టపరంగా సమాధానం చెబుతానని వ్యాఖ్యానించారు. తనపై ఎన్ని ఒత్తిళ్లు తీసుకొచ్చినా, ఎన్ని అడ్డంకులు సృష్టించినా పార్టీ కోసం పోరాటం కొనసాగిస్తానని ధర్మారెడ్డి స్పష్టం చేశారు.

78వ ఆర్ఆర్ బ్యాచ్ ఐపీఎస్ ప్రొబేషనరీ అధికారులకు నాలుగు వారాల ప్రత్యేక శిక్షణ ప్రారంభం

తెలంగాణ పోలీసింగ్, నూతన నేరాల సవాళ్లు, నాయకత్వ లక్షణాలపై శిక్షణ





గండిపేట(క్రైమ్ మిర్రర్): ఆర్.బి.వి.ఆర్.ఆర్. తెలంగాణ పోలీస్ అకాడమీలో 78వ ఆర్.ఆర్.(2025) బ్యాచ్‌కు చెందిన ఇద్దరు ఐపీఎస్ ప్రొబేషనరీ అధికారులు ఎన్. చేతన రెడ్డి, హర్ష దబారియాలకు నాలుగు వారాల ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఈ రోజు ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏకశిల అడ్మినిస్ట్రేటివ్ భవనంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి అకాడమీ డైరెక్టర్, డీజీపీ అభిలాష బిష్ట్ ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ అభిలాష బిష్ట్ మాట్లాడుతూ అధికారులు పోలీస్ వ్యవస్థలో కీలకమైన నాయకత్వ బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుందని, వారి నిర్ణయాలు, నాయకత్వ లక్షణాలు పోలీసింగ్ వ్యవస్థ పనితీరుపై ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా నేరాల స్వరూపం కూడా వేగంగా మారుతోందని, ముఖ్యంగా సైబర్ నేరాలు, డ్రగ్స్ సంబంధిత నేరాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు నూతన చట్టాలపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. పోలీసు అధికారుల విధి నిర్వహణలో వృత్తిపరమైన నైతిక విలువలు, క్రమశిక్షణ, ప్రజలతో వ్యవహరించే తీరు అత్యంత ముఖ్యమని ఆమె స్పష్టం చేశారు. పోలీసు అధికారులు తమ ప్రవర్తనలో ఉన్నత ప్రమాణాలను పాటిస్తూ ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించాలని సూచించారు. స్తుత డిజిటల్ యుగంలో సోషల్ మీడియా ద్వారా తప్పుడు సమాచారం, అసత్య వార్తలు వేగంగా వ్యాప్తి చెందుతున్నాయని, వాటి పట్ల పోలీసులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సైబర్ ప్రపంచంలో అమాయక ప్రజలు మోసాలకు గురై ఆర్థికంగా నష్టపోతున్నారని, ఇలాంటి నేరాలను అరికట్టడం పోలీసులకు ఒక ప్రధాన సవాలుగా మారిందని పేర్కొన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ సమస్యలు కూడా పోలీసు వ్యవస్థ ముందున్న ముఖ్యమైన సవాళ్లని వివరించారు. పోలీస్ అధికారులు బాధితుల పట్ల మానవతా దృక్పథం తో వ్యవహరించాలని, వారి సంతృప్తి ఎంతో ముఖ్యమని కోరారు. నిందితుల పట్ల చట్ట ప్రకారం వ్యవహరించాలని కోరారు. ఈ నాలుగు వారాల శిక్షణలో భాగంగా తెలంగాణ రాష్ట్ర రాజకీయ, భౌగోళిక పరిస్థితులు, భాష, సంస్కృతి, సంప్రదాయాలు, తెలంగాణ పోలీసింగ్ వ్యవస్థ అభివృద్ధి, రాష్ట్రంలోని శాంతిభద్రతల పరిస్థితులు తదితర అంశాలపై ప్రత్యేక అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయి ప్రాక్టికల్ శిక్షణలో భాగంగా స్థానిక పరిస్థితులు, పోలీసు విధానాలు, ప్రజల సమస్యలపై క్షేత్రస్థాయి అవగాహన కల్పిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు డాక్టర్ చేతన, జి. కవిత, అసిస్టెంట్ డైరెక్టర్లు వేమా శ్రీనివాసరెడ్డి, యార్లగడ్డ రాంబాబు, వేముల శ్రీనివాసరావు, డీఎస్పీలు, కోర్సు కోఆర్డినేటర్లు వేముల భాస్కర్, ఆదూరి శ్రీనివాసరావు, శ్రీరాములు, డాక్టర్ రమాదేవి, ఇతర రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నాలుగు వారాల పాటు కొనసాగనుంది.

హైదరాబాద్ పచ్చదనానికి శుద్ధి చేసిన వ్యర్థజలాలు

హెచ్ఎండీఏ--హెచ్‌సీసీబీ మధ్య కీలక ఒప్పందం..

రోజుకు 6 లక్షల లీటర్ల నీటి సరఫరా

హైదరాబాద్(క్రైమ్ మిర్రర్): నగరంలోని పచ్చదనాన్ని పరిరక్షించడంతో పాటు మంచినీటి వనరుల వినియోగాన్ని తగ్గించే దిశగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ), హిందుస్తాన్ కోకా-కోలా బేవరేజెస్ ప్రైవేట్ లిమిటెడ్ (హెచ్‌సీసీబీ) కీలక ముందడుగు వేశాయి. మొక్కలకు నీరందించేందుకు శుద్ధి చేసిన పారిశ్రామిక వ్యర్థజలాలను పునర్వినియోగించేలా ఇరు సంస్థల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం సిద్దిపేట జిల్లా బండ తిమ్మాపూర్‌లోని హెచ్‌సీసీబీ అవిన్య ఉత్పత్తి కేంద్రం నుంచి రోజుకు 6 లక్షల లీటర్ల శుద్ధి చేసిన వ్యర్థజలాలను సరఫరా చేయనున్నారు. ఈ నీటిని ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) వెంబడి ఎగ్జిట్ 4 నుంచి ఎగ్జిట్ 8 మధ్య ఉన్న పచ్చదనంతో పాటు హెచ్ఎండీఏ ఆధ్వర్యంలోని ఇతర గ్రీన్‌బెల్ట్‌లలోని మొక్కలకు వినియోగించనున్నారు. హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, ఐఏఎస్ సమక్షంలో హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్ట్రీ డైరెక్టర్, బీపీపీ ఓఎస్‌డీ (ఇన్‌చార్జ్) రోహిత్ గోపిడి, ఐఎఫ్ఎస్, హెచ్‌సీసీబీ ప్రతినిధులు ఒప్పంద పత్రాలను పరస్పరం మార్చుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండీఏ ఉన్నతాధికారులతో పాటు అవిన్య ప్లాంట్ ఫ్యాక్టరీ మేనేజర్ మాధవన్ పిళ్లై నేతృత్వంలోని హెచ్‌సీసీబీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ మాట్లాడుతూ, ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో ఈ ఒప్పందం ఎంతో సమయోచితమైనదని పేర్కొన్నారు. నగర పచ్చదనం కోసం శుద్ధి చేసిన వ్యర్థజలాలను వినియోగించడం వల్ల భూగర్భ జలాలపై ఆధారపడటం తగ్గుతుందని, విలువైన మంచినీటి వనరులను భవిష్యత్ అవసరాల కోసం సంరక్షించుకోవచ్చని తెలిపారు. వాతావరణ మార్పులను తట్టుకునే సుస్థిర మౌలిక సదుపాయాల నిర్మాణానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని చెప్పారు. ఓఆర్ఆర్ వెంబడి ఏడాది పొడవునా పచ్చదనాన్ని కాపాడేందుకు నిరంతర నీటి యాజమాన్య విధానం అవసరమని రోహిత్ గోపిడి తెలిపారు. శుద్ధి చేసిన వ్యర్థజలాలను మొక్కల పెంపకానికి మళ్లించడం ద్వారా మంచినీటి సరఫరాపై ఒత్తిడి తగ్గించడంతో పాటు, నగరంలోని పచ్చని ప్రాంతాలను దీర్ఘకాలికంగా పరిరక్షించవచ్చని వివరించారు. హెచ్‌సీసీబీ ఇంటిగ్రేటెడ్ సప్లై చైన్ హెడ్ అవినాష్ కాంత్ కుమార్ మాట్లాడుతూ, ఈ భాగస్వామ్యం తమ అవిన్య తయారీ కేంద్రం పరిధిని దాటి ప్రాంతీయ పర్యావరణ పరిరక్షణకు సంస్థ చేస్తున్న కృషిని విస్తరిస్తుందని పేర్కొన్నారు. నీటి సంరక్షణలో భాగస్వామిగా నిలవడం సంతోషంగా ఉందన్నారు. హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్ట్రీ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ దొనేపూడి చక్రపాణి, ఫారెస్ట్ మేనేజర్ నిఖిల్ రెడ్డి, హెచ్‌సీసీబీ పబ్లిక్ అఫైర్స్ అండ్ కమ్యూనికేషన్స్ మేనేజర్ కె. కృష్ణ కశ్యప్ తదితరులు ఈ ఒప్పందం కార్యరూపం దాల్చడంలో కీలక పాత్ర పోషించారు. రోజుకు ఆరు లక్షల లీటర్ల శుద్ధి చేసిన నీటిని పచ్చదనం కోసం వినియోగించే ఈ కార్యక్రమం అమలుతో ఓఆర్ఆర్ పరిసరాల్లోని గ్రీన్‌బెల్ట్‌లకు నీటి కొరతను అధిగమించడంలో ఊరట లభించనుంది. అదే సమయంలో మంచినీటి వనరుల పరిరక్షణకు కూడా తోడ్పాటు అందనుంది.

ఉప్పర్‌పల్లిలో బిఆర్ఎస్ కార్యాలయంపై బుల్డోజర్

రాజకీయ కక్షతోనే కూల్చివేత చర్యలు చేపట్టారంటూ ధర్మారెడ్డి ఆరోపణలు



గండిపేట(క్రైమ్ మిర్రర్): ఉప్పర్‌పల్లిలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై జీహెచ్ఎంసీ అధికారులు బుల్డోజర్‌తో కూల్చివేత చర్యలు చేపట్టడం స్థానికంగా రాజకీయ చర్చకు దారితీసింది. పిల్లర్ నంబర్ 183 సమీపంలో ఉన్న పార్టీ కార్యాలయాన్ని అధికారులు కూల్చివేశారు. గత ఐదేళ్లుగా కొనసాగుతున్న కార్యాలయంపై ఇప్పుడు అకస్మాత్తుగా చర్యలు తీసుకోవడంపై బీఆర్ఎస్ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ కూల్చివేత చర్యలపై బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొరెడ్డి ధర్మారెడ్డి తీవ్రంగా స్పందించారు. రాజకీయ కక్షతోనే పార్టీ కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకుని కూల్చివేశారని ఆయన ఆరోపించారు. కొందరు రాజకీయ నాయకుల అండదండలతో తమను ఉద్దేశపూర్వకంగా టార్గెట్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమను రాజకీయంగా కించపరిచేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఐదేళ్లుగా కొనసాగుతున్న పార్టీ కార్యాలయంపై ఇన్నాళ్లూ ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఇప్పుడు అకస్మాత్తుగా కూల్చివేతకు ఎందుకు దిగారని ధర్మారెడ్డి ప్రశ్నించారు. ఈ చర్యల వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయా అనే అనుమానాలను వ్యక్తం చేశారు. మీడియా ఎదుట అధికారుల తీరును తప్పుబడుతూ తన నిరసనను వ్యక్తం చేశారు. మరోవైపు, జీహెచ్ఎంసీ అధికారులు కూల్చివేతకు సంబంధించి వెల్లడించిన అధికారిక కారణాలు, కార్యాలయానికి సంబంధించిన అనుమతులు లేదా స్థల వివాదంపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
8 మంగళవారం 24-11-2026



భీమారంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకం ప్రారంభం

రూ.5 లక్షల భీమా పథకాన్ని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలి: సర్పంచ్ విజయలక్ష్మి

పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక సహాయ కేంద్రం ఏర్పాటు

105 మందికి కొత్త ఆసరా పింఛన్లు మంజూరు

భీమారం, నవంబరు 23 (క్రైమ్ మిర్రర్): ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకాన్ని భీమారం మేజర్ గ్రామపంచాయతీలో సోమవారం ప్రారంభించారు. సర్పంచ్ ఉస్కామల్ల విజయలక్ష్మి పున్నంచంద్ అధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎంపీడీఓ వీణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోడేటి రవి, ఎంపీఓ సతీష్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై పథకాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి కుటుంబం రూ.5 లక్షల భీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలకు అవసరమైన సమాచారం, నమోదు ప్రక్రియలో సహకారం అందించేందుకు గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అర్హులైన వారంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.అలాగే ఆసరా పింఛన్ల కింద భీమారం గ్రామపంచాయతీ పరిధిలో 105 మంది కొత్త లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించేందుకు అనుమతి లభించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ అధికారి సుధాకర్, ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్ గౌడ్, గృహ నిర్మాణ శాఖ ఏఈ రుచిత, గ్రామ కార్యదర్శి మల్లేష్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ప్రకాష్, సత్తిరెడ్డి, ఉపసర్పంచ్ సత్తమ్మ కిష్టయ్య, వార్డు సభ్యుల అధ్యక్షుడు రేవంత్ పటేల్, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కాటేదాన్‌లో వైభవంగా 18వ మహాపడి పూజ మహోత్సవం

అయ్యప్ప స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్న బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి



గండిపేటక్రైమ్ మిర్రర్: రాజేంద్రనగర్ నియోజకవర్గం కాటేదాన్ డివిజన్ పరిధిలోని హనుమాన్ చౌరస్తాలో అయ్యప్ప స్వామి 18వ మహాపడి పూజ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. అయ్యప్ప స్వామి భక్తుల శరణుఘోష, నామస్మరణల మధ్య పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కన్నుల పండువగా నిర్వహించారు. రంజిత్ గురుస్వామి, రమేష్ గురుస్వామి, మల్లేష్ గురుస్వామి, అశోక్ గురుస్వాముల ఆధ్వర్యంలో టీవీ9 శ్రీనివాస్ గురుస్వామి 18వ మహాపడి పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన అయ్యప్ప స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమానికి విచ్చేసిన కార్తీక్ రెడ్డికి నిర్వాహకులు, అయ్యప్ప స్వామి భక్తులు ఘన స్వాగతం పలికారు. భక్తులతో కలిసి మహాపడి పూజలో పాల్గొన్న ఆయన కొంతసేపు ఆధ్యాత్మిక వాతావరణంలో గడిపారు. ఈ కార్యక్రమంలో కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్‌తో పాటు పలువురు పార్టీ సీనియర్ నాయకులు, స్థానిక నాయకులు, అయ్యప్ప స్వామి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్వామియే శరణం అయ్యప్ప అనే నినాదాలతో హనుమాన్ చౌరస్తా ప్రాంతమంతా మార్మోగింది.

జాతీయ స్థాయిలో తెలంగాణ పోలీస్ హ్యాట్రిక్ విజయాలు కొనసాగించాలి

ముంబైలో జరగనున్న అఖిల భారత పోలీస్ డ్యూటీ మీట్‌కు ప్రతిభావంతులైన కొత్త బృందాన్ని సిద్ధం చేయాలి.. హైదరాబాద్ సీపీ మహేష్ భగవత్







గండిపేటక్రైమ్ మిర్రర్: జాతీయ స్థాయిలో తెలంగాణ పోలీస్ శాఖ సాధిస్తున్న విజయపరంపరను కొనసాగిస్తూ వరుసగా నాలుగోసారి అఖిల భారత పోలీస్ డ్యూటీ మీట్‌లో ఓవరాల్ టీమ్ ఛాంపియన్‌షిప్ సాధించే దిశగా సిబ్బంది కృషి చేయాలని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ మహేష్ మురళీధర్ భగవత్ ఆకాంక్షించారు. ఆర్‌బీవీఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో సోమవారం నిర్వహించిన మూడవ తెలంగాణ రాష్ట్ర పోలీస్ డ్యూటీ మీట్--2026ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. తెలంగాణ పోలీస్ శాఖ వరుసగా మూడు అఖిల భారత పోలీస్ డ్యూటీ మీట్‌లలో ఓవరాల్ టీమ్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకోవడం గర్వకారణమన్నారు. ఈ విజయాలను స్ఫూర్తిగా తీసుకొని రాబోయే జాతీయ స్థాయి పోటీల్లోనూ అదే ప్రతిభను చాటాలని పోలీసు సిబ్బందికి పిలుపునిచ్చారు. నేరం జరిగిన ప్రదేశానికి మొదట చేరుకునే పోలీసు అధికారి తీసుకునే చర్యలు దర్యాప్తులో అత్యంత కీలకమని మహేష్ భగవత్ పేర్కొన్నారు. ముఖ్యంగా ఘటనాస్థలంలో మొదటి కొన్ని నిమిషాల్లో గుర్తించి, భద్రపరిచే ఆధారాలే తదుపరి దర్యాప్తు దిశను నిర్ణయిస్తాయని వివరించారు. 2024 జూలై 1 నుంచి అమల్లోకి వచ్చిన నూతన నేర చట్టాలైన బీఎన్ఎస్, బీఎన్ఎస్ఎస్, బీఎస్ఏ ప్రకారం నేరస్థలంలో ఈ-సాక్ష్య ద్వారా ఆడియో, వీడియో ఆధారాల సేకరణకు ప్రాధాన్యత పెరిగిందని గుర్తుచేశారు. గతంలో క్లూస్ టీమ్ నిర్వహించిన అనేక బాధ్యతలను ఇప్పుడు ప్రతి పోలీస్ స్టేషన్ స్థాయిలోని సిబ్బంది కూడా సమర్థవంతంగా నిర్వర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విధుల్లో పోలీసులకు అవసరమైన నైపుణ్యాలు పెంపొందించేందుకు పోలీస్ డ్యూటీ మీట్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కేవలం ఒక్కరోజు సాధనతోనే పోటీదారులు అద్భుతమైన క్రమశిక్షణతో మార్చ్‌పాస్ట్ నిర్వహించడంపై ఆయన ప్రత్యేకంగా అభినందించారు. వచ్చే నెల డిసెంబర్ 15 నుంచి 20వ తేదీ వరకు ముంబైలో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) ఆధ్వర్యంలో జరగనున్న అఖిల భారత పోలీస్ డ్యూటీ మీట్‌కు తెలంగాణ రాష్ట్ర జట్టును ఎంపిక చేసేందుకు నాలుగు రోజులపాటు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు సీపీ వెల్లడించారు. నిబంధనల ప్రకారం గత మూడేళ్లలో విజేతలుగా నిలిచిన వారికి తిరిగి అవకాశం లేని నేపథ్యంలో కొత్త ప్రతిభను వెలికితీయడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఎంపికైన వారికి సీఐడీ విభాగం పర్యవేక్షణలో 15 నుంచి 20 రోజులపాటు ప్రత్యేక శిక్షణ అందించి జాతీయ స్థాయి పోటీలకు సిద్ధం చేయనున్నట్లు వివరించారు. పోటీల్లో పాల్గొనే సిబ్బంది ఇతర విభాగాల సహచరుల పనితీరును పరిశీలిస్తూ కొత్త విషయాలను నేర్చుకోవాలని, తమకు తెలిసిన నైపుణ్యాలను ఇతరులకు నేర్పించాలని సూచించారు. విధి నిర్వహణలో చూపే శ్రద్ధ, క్రమశిక్షణనే పోటీల్లోనూ ప్రదర్శించాలని కోరారు. అడిషనల్ సీపీ (క్రైమ్స్ అండ్ సిట్) ఎం. శ్రీనివాసులు, ఐపీఎస్ స్వాగతోపన్యాసం చేస్తూ.. రాష్ట్రంలోని 16 పోలీస్ విభాగాల నుంచి దాదాపు 500 మంది పోటీదారులు ఈ డ్యూటీ మీట్‌లో పాల్గొంటున్నారని తెలిపారు. జోన్-1 నుంచి జోన్-7 వరకు ఉన్న విభాగాలు, వివిధ పోలీస్ కమిషనరేట్లు, సీఐడీ, ఇంటెలిజెన్స్, ఆక్టోపస్, గ్రేహౌండ్స్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో, టీజీఎస్పీ తదితర విభాగాల సిబ్బంది తమ ప్రతిభను ప్రదర్శించనున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం. రమేష్, ఐపీఎస్, అడిషనల్ సీపీ (లా అండ్ ఆర్డర్) తఫ్సీర్ ఇక్బాల్, ఐపీఎస్, డీఐజీ (సీఐడీ) నారాయణ నాయక్, ఐపీఎస్, డీసీపీలు ఆర్. వెంకటేశ్వర్లు, కిరణ్ ఖారే, రక్షిత కృష్ణమూర్తి, రాజేంద్రనగర్ జోన్ డీసీపీ శ్రీనివాస్, వైభవ్ గైక్వాడ్, అరవింద్ బాబు, చైతన్య కుమార్, లావణ్య నాయక్, కె. వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అలాగే 1వ, 8వ బెటాలియన్ల కమాండెంట్లు, విశ్రాంత పోలీసు అధికారులు ప్రతాప్, రామకృష్ణ, పుణ్యచందర్, ఇతర సీనియర్ పోలీసు అధికారులు, న్యాయనిర్ణేతలు, వివిధ విభాగాల నుంచి వచ్చిన పోటీదారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

అత్యాధునిక వైద్యంతో 65 ఏళ్ల మహిళకు పునర్జన్మ

వీఏ-ఈసీఎంఓ సాంకేతికతతో క్లిష్టమైన గుండె చికిత్స విజయవంతం..

మూడు స్టెంట్ల ఏర్పాటు



గండిపేటక్రైమ్ మిర్రర్: తీవ్ర గుండెపోటు, కార్డియోజెనిక్ షాక్‌తో ప్రాణాపాయ స్థితికి చేరుకున్న 65 ఏళ్ల మహిళకు హైటెక్ సిటీ యశోద ఆసుపత్రి వైద్యులు అత్యాధునిక వైద్య సాంకేతికతతో ప్రాణాలు కాపాడారు. గుండె పనితీరు పూర్తిగా దెబ్బతిని సాధారణ చికిత్స కూడా ప్రమాదకరంగా మారిన పరిస్థితుల్లో వీఏ-ఈసీఎంఓ సాంకేతికత సహాయంతో క్లిష్టమైన చికిత్సను విజయవంతంగా నిర్వహించి ఆమెను కోలుకునేలా చేశారు. గతంలో అధిక రక్తపోటు, మధుమేహం, స్థూలకాయం వంటి ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న సదరు మహిళకు తీవ్ర గుండెపోటు రావడంతో రక్తపోటు ప్రమాదకర స్థాయికి పడిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను అత్యంత విషమ పరిస్థితిలో ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షల్లో గుండెకు రక్తాన్ని సరఫరా చేసే ప్రధాన రక్తనాళమైన లెఫ్ట్ మెయిన్ కరోనరీ ఆర్టరీలో తీవ్ర అడ్డంకితో పాటు మరో మూడు ప్రధాన రక్తనాళాల్లోనూ బ్లాకేజీలు ఉన్నట్లు గుర్తించారు. గుండె పనితీరు గణనీయంగా తగ్గిపోవడంతో చికిత్స చేయడం వైద్యులకు సవాలుగా మారింది. ఈ నేపథ్యంలో కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ దామోదర్ రెడ్డి నేతృత్వంలోని వైద్య బృందం వీఏ-ఈసీఎంఓ సపోర్ట్‌తో ప్రొటెక్టెడ్ పీసీఐ చికిత్స చేపట్టింది. ఈ ప్రక్రియలో మూడు కరోనరీ స్టెంట్లను అమర్చి గుండె రక్తనాళాల్లో రక్తప్రసరణను మెరుగుపరిచారు. చికిత్స అనంతరం 24 గంటల పాటు వీఏ-ఈసీఎంఓ ద్వారా గుండెకు అవసరమైన మద్దతు అందించారు. ఆ తర్వాత రోగి ఆరోగ్య పరిస్థితి క్రమంగా మెరుగుపడటంతో ఈసీఎంఓ సపోర్టును తొలగించారు. రెండో రోజున వెంటిలేటర్ నుంచి బయటకు తీసుకువచ్చారు. మూడో రోజుకే ఆరోగ్యం మరింత మెరుగుపడటంతో ఐసీయూ నుంచి సాధారణ వార్డుకు తరలించారు. గుండె పనితీరులోనూ గణనీయమైన పురోగతి కనిపించడంతో వైద్యులు, కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ దామోదర్ రెడ్డి మాట్లాడుతూ, రోగి ఆసుపత్రికి చేరుకునే సమయానికి పరిస్థితి అత్యంత విషమంగా ఉందని తెలిపారు. వీఏ-ఈసీఎంఓ సపోర్ట్‌తో ప్రొటెక్టెడ్ పీసీఐ చికిత్స అందించడం వల్లే ఆమె ప్రాణాలను కాపాడగలిగామని వివరించారు. అత్యాధునిక వైద్య సాంకేతికతతో పాటు వైద్య బృందం సమన్వయంతో ఈ చికిత్స విజయవంతమైందన్నారు. గుండెపోటు లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించి సకాలంలో చికిత్స పొందాలని ప్రజలకు సూచించారు.

ఓఆర్ఆర్‌పై అదుపుతప్పి కిందపడిన సిమెంట్ లారీ

డ్రైవర్‌కు తప్పిన ప్రమాదం.. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం లేదన్న పోలీసులు





గండిపేటక్రైమ్ మిర్రర్: శంషాబాద్ పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డుపై సోమవారం తెల్లవారుజామున సిమెంట్ లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపుతప్పి రోడ్డు పక్కకు పడిపోయింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ ఎలాంటి గాయాలు కాకుండా సురక్షితంగా బయటపడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. కోదాడ నుంచి కోకాపేటకు సిమెంట్ లోడ్‌తో వెళ్తున్న టిఎస్29టి5499 నంబరు గల లారీ, ఉదయం సుమారు 5 గంటల సమయంలో శంషాబాద్ ఓఆర్ఆర్ ఎగ్జిట్-17 సమీపంలోని చెన్నమ్మ హోటల్ వద్ద అదుపుతప్పి రింగ్ రోడ్డు నుంచి కిందపడింది. ఈ ఘటనపై ఉదయం సమయంలో డయల్-100కు సమాచారం అందింది. వెంటనే స్పందించిన ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్ పెట్రోలింగ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ప్రమాదంలో డ్రైవర్ సురక్షితంగా బయటపడగా, ఎలాంటి గాయాలు కాలేదని పోలీసులు తెలిపారు. అనంతరం లారీని రహదారి పక్కకు తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. ఈ ఘటనపై ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఆర్జీఐఏ పోలీసులు వెల్లడించారు.

అగ్రి వర్సిటీ వీసీపై మహిళా ప్రొఫెసర్ ఆరోపణలు

ధర్నా చౌక్‌లో ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభం..

తనకు న్యాయం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి



గండిపేట(క్రైమ్ మిర్రర్): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి (వీసీ) ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్యపై ఆరోపణలు చేస్తూ ఓ మహిళా ప్రొఫెసర్ సోమవారం హైదరాబాద్‌లోని ధర్నా చౌక్ వద్ద ఆమరణ నిరాహార దీక్షకు దిగారు. వీసీ హోదాలో కొనసాగుతున్న ఆల్దాస్ జానయ్య కారణంగా తనకు ఇంకా అన్యాయం జరుగుతోందని, తనకు న్యాయం జరిగే వరకు దీక్ష విరమించేది లేదని ఆమె స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బాధిత మహిళా ప్రొఫెసర్ మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయంలో మహిళా ఉద్యోగులు, అధ్యాపకుల భద్రతకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 70 శాతానికి పైగా మహిళలు ఉన్నారని, వారిలో పలువురు వీసీ వ్యవహారశైలితో వివిధ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. తనకు మద్దతుగా నిలుస్తున్న వారిని సైతం భయభ్రాంతులకు గురిచేస్తూ, వారిపై కేసులు నమోదు చేయిస్తున్నారని ఆమె ఆరోపించారు. వీసీ హోదాలో కొనసాగుతున్న వ్యక్తి కారణంగా మహిళా ఉద్యోగులు స్వేచ్ఛగా పనిచేయలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణమే స్పందించి తనకు న్యాయం చేయాలని మహిళా ప్రొఫెసర్ విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్య దేశంలో మహిళలకు భద్రత, సమానత్వం, న్యాయం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు, అధ్యాపకులకు ఎలాంటి వేధింపులు, బెదిరింపులు లేకుండా స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించాలని కోరారు. తనకు న్యాయం జరిగేంతవరకు ధర్నా చౌక్‌లో ఆమరణ నిరాహార దీక్ష కొనసాగిస్తానని ఆమె ప్రకటించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మహిళా ఉద్యోగుల భద్రత, వీసీపై వచ్చిన ఆరోపణలు, బాధిత ప్రొఫెసర్‌కు న్యాయం చేయాలనే డిమాండ్లతో చేపట్టిన ఈ దీక్ష ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

ఘనంగా మాజీ ఐపీఎస్ అధికారి డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ 59వ జన్మదిన వేడుకలు

కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన పోతురాజు యాదయ్య మాదిగ



గండిపేట(క్రైమ్ మిర్రర్): మాజీ ఐపీఎస్ అధికారి, సామాజిక చైతన్యవేత్త, విద్యావేత్త డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ 59వ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు, శ్రేయోభిలాషులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన శ్రేయోభిలాషి పోతురాజు యాదయ్య మాదిగ తన అనుచరులు, అభిమానులు, విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరిపారు. డాక్టర్ ప్రవీణ్ కుమార్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. 1967 నవంబర్ 23న తెలంగాణలోని అలంపూర్‌లో జన్మించిన డాక్టర్ రేపల్లె శివ ప్రవీణ్ కుమార్ తన కృషి, పట్టుదలతో ఉన్నత స్థాయికి ఎదిగారు. వెటర్నరీ సైన్స్‌లో పట్టభద్రుడిగా, పీజీ పూర్తి చేసిన ఆయన అమెరికాలోని ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ విశ్వవిద్యాలయం కెన్నెడీ స్కూల్ నుంచి మాస్టర్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ (ఎంపీఏ) పట్టా పొందారు. 1995 బ్యాచ్ ఐపీఎస్ అధికారిగా పోలీస్ శాఖలో చేరిన ఆయన వివిధ కీలక హోదాల్లో బాధ్యతలు నిర్వర్తించారు. కరీంనగర్ జిల్లా ఎస్పీగా, హైదరాబాద్ పోలీస్ శాఖలో పలు బాధ్యతల్లో పనిచేసి విశేష సేవలందించారు. అదనపు డీజీపీ హోదా వరకు ఎదిగిన ఆయన రాష్ట్రపతి పోలీస్ పతకంతో పాటు పలు ప్రతిష్ఠాత్మక పురస్కారాలను అందుకున్నారు. ముఖ్యంగా తెలంగాణ సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ గురుకుల విద్యాసంస్థల కార్యదర్శిగా పనిచేసిన సమయంలో పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు అనేక వినూత్న కార్యక్రమాలు చేపట్టారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, క్రీడా స్ఫూర్తి, సృజనాత్మకతను పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. వేలాది మంది విద్యార్థుల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి కృషి చేస్తూ విద్యను సామాజిక అభివృద్ధికి బలమైన సాధనంగా మలిచారు. ఈ సందర్భంగా పోతురాజు యాదయ్య మాదిగ మాట్లాడుతూ.. డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ వంటి వ్యక్తులు సమాజానికి, ముఖ్యంగా విద్యార్థి లోకానికి ఆదర్శప్రాయులని అన్నారు. విద్య ద్వారానే సమాజంలో సమానత్వం, అభివృద్ధి సాధ్యమని నమ్ముతూ ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. అణగారిన వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు కల్పించడంలో ఆయన చేసిన కృషి ఎంతోమందికి స్ఫూర్తినిస్తోందని కొనియాడారు. ఈ వేడుకల్లో ఎన్. సూరిబాబు, కె. ప్రవీణ్, ఎం. రాజేష్, శ్రీరాములు, పి. విజయలక్ష్మి, సోనీ, ఎం. నరేష్, ఎం. సునీల్ తదితరులు పాల్గొని డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన భవిష్యత్తులోనూ ప్రజాసేవ, సామాజిక అభివృద్ధి రంగాల్లో మరిన్ని సేవలందించాలని ఆకాంక్షించారు.

కొంగర ఖుర్ద్ మత్స్యకారుల్లో కొత్త ఉత్సాహం..!

అధ్యక్షుడిగా మీగడ రాజ్ కుమార్, ఉపాధ్యక్షుడిగా సోప్పరి యాదయ్య ఎన్నిక..

కొత్తకుంట, కోమటికుంట, మైసమ్మ కుంటల అభివృద్ధికి కృషి చేస్తాం --- అధ్యక్షుడు రాజ్ కుమార్





మహేశ్వరం ప్రతినిధి క్రైమ్ మిర్రర్: రంగారెడ్డి జిల్లా: మహేశ్వరం మండలం కొంగరఖుర్ద్ గ్రామ పరిధిలోని కొత్తకుంట, కోమటికుంట, మైసమ్మ కుంటలకు సంబంధించిన మత్స్యకారుల సహకార సంఘం నూతన పాలకవర్గం ఎన్నికై ఆదివారం బాధ్యతలు స్వీకరించింది. నూతన మేనేజింగ్ కమిటీ అధ్యక్షుడిగా మీగడ రాజ్ కుమార్, ఉపాధ్యక్షుడిగా సోప్పరి యాదయ్య, కార్యదర్శిగా సప్పిడి శ్రీరాములు ఎన్నికయ్యారు. మేనేజింగ్ కమిటీ సభ్యులుగా లింగం చిన్న నర్సింహ,సప్పిడి నాగేష్, లింగం సురేష్,తాళ్ల రమేష్, పి. శ్రీకాంత్, పి. ఆంజనేయులు ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మీగడ రాజ్ కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన సంఘ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ పరిధిలోని మూడు కుంటలను అభివృద్ధి చేయడంతో పాటు చేపల ఉత్పత్తిని పెంచేందుకు ప్రత్యేక కృషి చేస్తానన్నారు. కుంటల్లో నీటి నిల్వ సామర్థ్యం పెంచడం, అవసరమైన చోట పూడికతీత పనులు చేపట్టడం, నాణ్యమైన చేప పిల్లలను వదిలి చేపల పెంపకాన్ని ప్రోత్సహించడం వంటి చర్యల కోసం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.చేపల ఉత్పత్తి పెరిగితే మత్స్యకార కుటుంబాలకు మెరుగైన ఆదాయం, ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వ మత్స్యశాఖ ద్వారా అందే పథకాలు, సబ్సిడీలు, సంక్షేమ ప్రయోజనాలను అర్హులైన మత్స్యకారులకు అందేలా కృషి చేస్తామని తెలిపారు. సంఘ సభ్యులందరినీ కలుపుకొని ఐక్యంగా ముందుకు సాగుతూ మూడు కుంటలను అభివృద్ధి చేసి మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.తెలంగాణ సహకార సంఘాల చట్టం 1964లోని సెక్షన్ 31(2)(ఎ) ప్రకారం నూతన కమిటీ పదవీకాలం ఐదేళ్లుగా నిర్ణయించారు. ఈ కమిటీ పదవీకాలం 2031 నవంబర్ 22వ తేదీతో ముగియనుంది. ఈ మేరకు ఎన్నికల అధికారి అధికారిక ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేశారు.

ఓటర్ల జాబితా పారదర్శకతతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ -- బీజేపీ నాయకులు

కరీంనగర్‌లో నితిన్ నబీన్ పాల్గొన్న ఎస్ఐఆర్ అవగాహన మహాపాదయాత్ర

ఎమ్మెల్సీ అంజిరెడ్డి, గోదావరి అంజిరెడ్డి, ఈర్ల రాజు ముదిరాజ్





పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, నవంబర్ 23: కరీంనగర్‌లో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ నేతృత్వంలో నిర్వహించిన ఎస్ఐఆర్ అవగాహన మహాపాదయాత్ర ఉత్సాహభరితంగా సాగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ పాల్గొనడం పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. ఈ మహాపాదయాత్రలో ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి, సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కోల్కూరి రాజశేఖర్ రెడ్డితో కలిసి బీరంగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఈర్ల రాజు ముదిరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులను మర్యాదపూర్వకంగా కలిసి ఎస్ఐఆర్ ప్రాధాన్యత, పార్టీ కార్యక్రమాలు, ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడంతో పాటు ఓటర్ల జాబితా పారదర్శకంగా, తప్పులు లేకుండా ఉండటం కూడా ముఖ్యమన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా ఓటర్ల జాబితాలను సమగ్రంగా పరిశీలించి అర్హులైన ఓటర్ల హక్కులను పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రతి గ్రామం, ప్రతి డివిజన్‌లో క్షేత్రస్థాయిలో కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి మాట్లాడుతూ ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి వెన్నెముక వంటిదని, ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలగాలంటే ఓటర్ల జాబితాలు పారదర్శకంగా ఉండాలన్నారు. జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ నేతృత్వంలో నిర్వహించిన ఈ మహాపాదయాత్ర ఎస్ఐఆర్ ప్రాధాన్యతను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మంచి వేదికగా నిలుస్తుందన్నారు. సంగారెడ్డి జిల్లాలోని ప్రతి మండలం, డివిజన్‌లో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తూ అర్హులైన ఓటర్లకు అవగాహన కల్పించాలని కోరారు. ఈర్ల రాజు ముదిరాజ్ మాట్లాడుతూ కరీంనగర్ మహాపాదయాత్రలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పాల్గొనడం పార్టీ కార్యకర్తలకు ఎంతో స్ఫూర్తినిచ్చిందన్నారు. ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి, జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డితో కలిసి కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఓటు హక్కు ప్రతి పౌరుడి ప్రజాస్వామ్య హక్కు అని, ఎస్ఐఆర్‌పై ప్రజలకు సరైన అవగాహన కల్పించడం ప్రతి బీజేపీ కార్యకర్త బాధ్యత అని పేర్కొన్నారు. జాతీయ నాయకత్వం ఇచ్చే ప్రతి పిలుపును ప్రజల్లోకి తీసుకెళ్తూ బీరంగూడ డివిజన్‌తో పాటు పటాన్‌చెరు నియోజకవర్గంలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఓటర్ల జాబితాలో పారదర్శకత, ప్రజాస్వామ్యానికి పటిష్టత, ప్రతి అర్హుడికి ఓటు హక్కు పరిరక్షణే లక్ష్యంగా బీజేపీ నిర్వహిస్తున్న కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కొండా లక్ష్మణ్, అమీన్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు కొత్తపల్లి రమేష్, ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని సూచించిన మాజీ కార్పొరేటర్ గోకరి సురేష్ గౌడ్





గండిపేట(క్రైమ్ మిర్రర్): కిస్మత్‌పూర్ డివిజన్ 122 పరిధిలోని ఓంనగర్ కాలనీలో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మాజీ కార్పొరేటర్ గోకరి సురేష్ గౌడ్ పరిశీలించారు. కాలనీవాసుల సౌకర్యార్థం చేపట్టిన ఈ అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల పురోగతి, నిర్మాణ నాణ్యతపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిర్ణీత ప్రమాణాలకు అనుగుణంగా పనులు చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కాలనీలో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా పనులను పర్యవేక్షించాలని జీహెచ్ఎంసీ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు శ్యాములు గౌడ్, జీహెచ్ఎంసీ ఏఈ నరసింహమూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

క్రీడల్లో సత్తా చాటిన కృష్ణవేణి విద్యార్థులు

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఐదుగురి ఎంపిక.. అభినందించిన సీఐ పర్స రమేష్



మందమర్రి టౌన్ నవంబర్ 23 క్రైమ్ మిర్రర్: పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ఉన్న హైదరాబాద్ కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి అండర్-17 బాలుర నెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 17న నిర్వహించిన జోనల్ స్థాయి నెట్‌బాల్ పోటీల్లో మంచిర్యాల జిల్లా జట్టు ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లా జట్లపై విజయం సాధించి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది.ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన కృష్ణవేణి పాఠశాల విద్యార్థులు ఎస్.కె. షహబాజ్, పిప్రే శివచరణ్, రేకుల సాహెత్, వేముల శశివర్ధన్, నాగుల జాయ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను మందమర్రి సీఐ పర్స రమేష్ ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా సీఐ రమేష్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించేలా శిక్షణ పొందాలని, పాఠశాలల్లో ఆటలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. చదువు, క్రీడలపై దృష్టి సారిస్తే చెడు అలవాట్లకు దూరంగా ఉండవచ్చని తెలిపారు. ఒకే పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్టణానికి, జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు.

ప్రీ స్కూల్‌లో అడుగుపెట్టిన రామ్ చరణ్ కుమార్తె క్లింకార

చిన్నారి సరికొత్త ప్రయాణంపై అభిమానుల హర్షం

కూతురి స్పెషల్ మూమెంట్‌తో మురిసిపోయిన చరణ్, ఉపాసన దంపతులు

2023 జూన్‌లో జన్మించిన మెగా ప్రిన్సెస్



టాలీవుడ్ స్టార్ హీరో రామ్ చరణ్, ఉపాసన దంపతుల గారాల పట్టి క్లీంకార కొణిదెల తన విద్యా ప్రయాణాన్ని ప్రారంభించింది. ప్రస్తుతం మూడేళ్ల వయసున్న క్లీంకార తాజాగా ప్రీ స్కూల్‌లో అడుగుపెట్టింది. చిన్నారి జీవితంలో ఎదుగుదలకు సంబంధించిన ఈ సరికొత్త ఘట్టం కుటుంబ సభ్యులతో పాటు అభిమానుల్లోనూ ప్రత్యేక ఆసక్తిని రేకెత్తిస్తోంది.రామ్ చరణ్, ఉపాసన దంపతులకు 2023 జూన్ 20న క్లీంకార జన్మించింది. మెగా కుటుంబంలోకి పాప రాకతో అప్పట్లో ఇరు కుటుంబాలు ఎంతో సంతోషాన్ని పంచుకున్నాయి. చిన్నారి నామకరణ మహోత్సవం నుంచి ప్రతి ప్రత్యేక సందర్భాన్ని ఎంతో వేడుకగా జరుపుకున్నారు. క్లీంకార పుట్టినప్పటి నుంచే ఆమెకు సంబంధించిన ప్రతి చిన్న అప్‌డేట్‌ను తెలుసుకునేందుకు అభిమానులు ఆసక్తి చూపిస్తూ వస్తున్నారు.పిల్లలు తొలిసారి పాఠశాలలో అడుగుపెట్టే రోజు తల్లిదండ్రుల జీవితంలో ఎప్పటికీ గుర్తుండిపోయే మధుర జ్ఞాపకం. ఈ క్రమంలోనే తమ ముద్దుల కూతురిని ప్రీ స్కూల్‌కు పంపిస్తూ రామ్ చరణ్, ఉపాసన దంపతులు ఈ ప్రత్యేక క్షణాలను ఆస్వాదించారు. దీనికి సంబంధించిన వీడియోలు నెట్టింట సందడి చేస్తున్నాయి.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
10 మంగళవారం 24-11-2026



రూ.14 లక్షలతో ఎల్ఐజీ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి

పాఠశాల అభివృద్ధి పనులను ప్రారంభించిన

మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి

సేల్స్‌ఫోర్స్, నిర్మాణ్ సంస్థల సహకారంతో ఆధునిక వసతుల కల్పన

త్వరలో భోజన షెడ్ నిర్మాణం

పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, నవంబర్ 23: భారతీనగర్ డివిజన్ ఎల్ఐజీ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆధునిక వసతులతో అభివృద్ధి చేశారు. సేల్స్‌ఫోర్స్, నిర్మాణ్ సంస్థల సహకారంతో సుమారు రూ.14 లక్షల విలువైన అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ పనులను భారతీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి ఆదివారం ప్రారంభిం చారు.పాఠశాలలో గతంలో ఉన్న పైకప్పు నీటి లీకేజీ సమస్యను పరిష్కరించేందుకు స్లాబ్ మరమ్మతులు చేపట్టడంతో పాటు ఫ్లోరింగ్, విద్యుత్ వ్యవస్థ, ప్లంబింగ్, పెయింటింగ్ పనులు పూర్తి చేశారు. మరుగుదొడ్లను పునరుద్ధరించి ఆధునీకరించడంతో పాటు అవసరమైన విద్యుత్ పరికరాలను ఏర్పాటు చేశారు. దీంతో పాఠశాల విద్యార్థులకు మెరుగైన వసతులు అందుబాటులోకి వచ్చాయి. అదేవిధంగా విద్యార్థుల సౌకర్యార్థం భోజన షెడ్ నిర్మాణాన్ని కూడా త్వరలో చేపట్టి వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని సేల్స్‌ఫోర్స్ సంస్థ ప్రతినిధులు హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా సింధు ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కార్పొరేట్ సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. సేల్స్‌ఫోర్స్, నిర్మాణ్ సంస్థలు సామాజిక బాధ్యతలో భాగంగా పాఠశాలకు అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణాన్ని కల్పించడంతో పాటు వారి భవిష్యత్తుకు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సేల్స్‌ఫోర్స్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ సుదీప్ కంచెర్ల, సీనియర్ డైరెక్టర్ అభినేష్ బద్దం, ప్రోగ్రామ్ మేనేజర్ స్వప్న తటికొండ, సీనియర్ మేనేజర్ పాండురంగారావు రల్లపల్లి, రామచంద్రపురం ఎంఈఓ భాస్కర్, ఎల్ఐజీ కాలనీ అధ్యక్షుడు యాదగిరి రెడ్డి, డైరెక్టర్ శామ్యూల్, మాజీ అధ్యక్షుడు నారాయణ రెడ్డి, శారద మహిళా మండలి అధ్యక్షురాలు వనజ, సత్యవతి, సరిత, స్థానిక నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు. నిర్మాణ్ సంస్థ తరఫున హరీష్, సౌమ్య, నిక్కీ, రామ్ తదితరులు పాల్గొన్నారు.

మంజీరా, నక్క వాగులను కాలుష్యం నుంచి కాపాడాలి

కాలుష్యానికి కారణమైన పరిశ్రమలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

పిసిబి అధికారులను సస్పెండ్ చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు



పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, నవంబర్ 23: మంజీరా నది, నక్క వాగులను పరిశ్రమల కాలుష్యం నుంచి కాపాడాలని, కాలుష్యానికి కారణమవుతున్న పరిశ్రమలపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నది కాలుష్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న కాలుష్య నియంత్రణ మండలి అధికారులను సస్పెండ్ చేయాలని కోరారు. ఈ మేరకు సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో పిసిబి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గొల్లపల్లి జయరాజు మాట్లాడుతూ సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, నిజామాబాద్, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు తాగునీరు, సాగునీరు అందిస్తున్న మంజీరా నదిని రసాయన పరిశ్రమల వ్యర్థాలతో కలుషితం చేయడం ఆందోళనకరమన్నారు. ఎడుపాయల దేవస్థానానికి సైతం నీటిని అందిస్తున్న మంజీరా నది పరిరక్షణకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. చౌటకూరు మండలంలోని వెండికోలు, లింగంపల్లి, కోర్పోలు తదితర గ్రామాల పరిధిలో నక్క వాగు కాలుష్య జలాలతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పరిసర ప్రాంతాల్లో దుర్వాసన వ్యాపిస్తోందని, చేపలు, ఇతర జలచరాలు మృత్యువాత పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీరు కలుషితం కావడంతో పంటలు దెబ్బతింటున్నాయని, ప్రజలకు తాగునీటి సమస్యలు కూడా ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. గతంలో మంజీరా నదిలో కాలుష్యం కారణంగా 15 నుంచి 20 క్వింటాళ్లకు పైగా చేపలు చనిపోయిన ఘటనలు జరిగినప్పటికీ, ఇప్పటివరకు బాధ్యులైన పరిశ్రమలపై సరైన చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. కాలుష్యానికి కారణమవుతున్న కంపెనీలను గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, నక్క వాగు, మంజీరా నదులను పరిరక్షించేందుకు పీసీబీ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాలుష్య నియంత్రణలో విఫలమైన అధికారులపై చర్యలు తీసుకోకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం. నరసింహులు, జిల్లా కమిటీ సభ్యులు డి. విద్యాసాగర్, నాయకులు అశోక్, నర్సింలు, అర్జున్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్లి స్థలాలు కేటాయించాలి

పెండింగ్‌లో ఉన్న అక్రిడిటేషన్ కార్డులను వెంటనే జారీ చేయాలి .. -జిల్లా కలెక్టర్‌కు టీజేపీ ఖమ్మం జిల్లా కమిటీ వినతి

ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో : ఖమ్మంలో అర్హులైన జర్నలిస్టులందరికీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించాలని పెండింగ్‌లో ఉన్న అక్రిడిటేషన్ కార్డులను వెంటనే మంజూరు చేసి అందజేయాలని కోరుతూ తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆఫీసులో సోమవారం డిఆర్ఓ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు జీ నాగ స్వామి మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న జర్నలిస్టులు ఎన్నో ఆర్థిక సామాజిక సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఏళ్ల తరబడి జర్నలిజం వృత్తిలో కొనసాగుతున్న అర్హులైన జర్నలిస్టుల కు సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.ఖమ్మం లో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన భూమిని అర్హులైన జర్నలిస్టులకు ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే పంపిణీ చేయాలని కోరారు. అదేవిధంగా అర్హత కలిగిన జర్నలిస్టులు దరఖాస్తు



చేసుకున్నప్పటికీ వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్న అక్రిడిటేషన్ కార్డులను తక్షణమే జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం జిల్లా యంత్రాంగం సానుకూలంగా స్పందించి ఈ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని టీజేపీ నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో టీజేపీ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం మణికుమార్ జిల్లా కార్యదర్శి మత్తి రామకృష్ణ టీజేపీ ఖమ్మం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ సయ్యద్ ఖాసీం జిల్లా ట్రెజరర్ బోడపట్ల సతీష్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎండి రషీద్ కార్యదర్శి ఎం చిన్ని జిల్లా నాయకులు నల్లమోతు శ్రీనివాసరావు గంజికుంట్ల వెంకన్న వాసం రాజేంద్రప్రసాద్ కొత్త వెంకన్న పామర్తి నాగేశ్వరరావు వి. మోహన్ రావు మల్లెబోయిన లక్షయ్య తదితరులు పాల్గొన్నారు.

వెయ్యి మంది నిరుద్యోగులకు పొంగులేటి శీనన్న యువనేస్తం'

పోలీసు ఉద్యోగాల సాధనకు పీఎస్ఆర్ ట్రస్ట్ చేయూత

ఒక్కొక్కరికీ 16 పుస్తకాలతో కూడిన పోటీ పరీక్షల కిట్లు పంపిణీ

ఉద్యోగాలు సాధించి శీనన్న రుణం తీర్చుకుంటామన్న అభ్యర్థులు

ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో: నిరుద్యోగ యువతకు అండగా నిలుస్తూ.. పోలీసు ఉద్యోగాల సాధనే లక్ష్యంగా వారికి అవసరమైన శిక్షణ, అధ్యయన సామగ్రిని అందించేందుకు రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. పొంగులేటి స్వరాజ్యం -- రాఘవ రెడ్డి (పీఎస్ఆర్) చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై ఉచిత శిక్షణ శిబిరంలో శిక్షణ పొందుతున్న వెయ్యి మందికి పైగా అభ్యర్థులకు 'పొంగులేటి శీనన్న యువనేస్తం' పేరిట పోటీ పరీక్షల పుస్తకాల కిట్లను పంపిణీ చేశారు.సోమవారం సాయంత్రం ఖమ్మంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి పంపిణీ చేశారు. రైట్ ఛాయిస్ అకాడమీ ఛైర్మన్ మెండెం కిరణ్‌కుమార్, ఏదులాపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోకబత్తిని అనిత అభ్యర్థులకు ఈ కిట్లను అందజేశారు. ఒక్కో కిట్‌లో 16 రకాల పుస్తకాలను పొందుపరిచారు. ఈ సందర్భంగా తుంబూరు దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించే అవకాశం కల్పించాలన్న సంకల్పంతో మంత్రి పొంగులేటి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. అందుకోసం ఖర్చుకు వెరవకుండా ఉచిత కోచింగ్‌తో పాటు అవసరమైన పుస్తకాలను సైతం అందిస్తున్నారని



పేర్కొన్నారు. అభ్యర్థులు కష్టపడి చదివి, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో లక్ష్యాన్ని చేరుకోవాలని.. తల్లిదండ్రుల ఆశలను, శీనన్న ఆకాంక్షలను నెరవేర్చాలని పిలుపునిచ్చారు.

ఉద్యోగమే లక్ష్యం.. శీనన్నకు కృతజ్ఞత

తమకు ఉచిత శిక్షణ అందించడంతో పాటు విలువైన పుస్తకాల కిట్లను కూడా అందిస్తున్న మంత్రి పొంగులేటికి అభ్యర్థులు కృతజ్ఞతలు తెలిపారు. శీనన్న తమకు కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి పోలీసు ఉద్యోగాలు సాధిస్తామని, ఆయన నమ్మకాన్ని నిలబెట్టి రుణం తీర్చుకుంటామని పలువురు అభ్యర్థులు పేర్కొన్నారు.

కిట్‌లోని 16 పుస్తకాలివే..

తెలంగాణ చరిత్ర, భారతదేశ చరిత్ర, జనరల్ నాలెడ్జ్, ఇండియన్ పాలిటీ, తెలంగాణ అంశాలు, బయాలజీ, కరెంట్ అఫైర్స్, ఇండియన్ ఎకానమీ, ఇంగ్లీష్, జనరల్ నాలెడ్జ్ వర్క్‌బుక్, ఫిజికల్ సైన్సెస్, రీజనింగ్, అర్థమెటిక్ వర్క్‌బుక్, ఇండియన్ జాగ్రఫీ, అర్థమెటిక్, తెలంగాణ సంస్కృతి--ఉద్యమ చరిత్ర పుస్తకాలను కిట్‌లో అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, పొంగులేటి అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా విధానాల రూపకల్పనలో పరిశోధన కీలకం: డాక్టర్ ఫ్రాన్సిస్ జేవియర్ రత్నం

ఆర్‌సీటీలతో పథకాల అసలు ప్రభావం అంచనా

సాక్ష్యాధారిత నిర్ణయాలతో మెరుగైన పాలన

28 దేశాల్లో పరిశోధన అనుభవం వివరించిన డాక్టర్ రత్నం

సమానమైన ఫలితాలకు ప్రయోగాత్మక మూల్యాంకనం అవసరం

విద్య, ప్రజా సేవల్లో కృత్రిమ మేధస్సు పాత్రపై చర్చ

పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, నవంబర్ 23: ప్రజా విధానాల ప్రభావాన్ని సమర్థవంతంగా అంచనా వేయడానికి ప్రయోగాత్మక మూల్యాంకన పద్ధతులు ఎంతో అవసరమని అథీనా ఇన్సైనామిక్స్ సీనియర్ డైరెక్టర్ డాక్టర్ ఫ్రాన్సిస్ జేవియర్ రత్నం అన్నారు. యాదృచ్ఛిక నియంత్రిత పరీక్షలు (ఆర్‌సీటీలు) సహా వివిధ ప్రయోగాత్మక విధానాలు ప్రభుత్వ కార్యక్రమాల వాస్తవ ప్రభావాన్ని తెలుసుకోవడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన కౌటిల్య స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీలో సోమవారం 'ఇది పనిచేసిందా? ప్రజా విధానం కోసం ప్రయోగాత్మక మూల్యాంకనానికి ఒక పరిచయం' అనే అంశంపై ఆయన ఆతిథ్య ఉపన్యాసం నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ ఫ్రాన్సిస్ జేవియర్ రత్నం మాట్లాడుతూ కఠినమైన మూల్యాంకనం, సాక్ష్యాధారిత విధానాలు ప్రభుత్వాలకు వాస్తవ ప్రపంచంలో తమ కార్యక్రమాల ప్రభావాన్ని అర్థం చేసుకోవడానికి దోహదపడతాయన్నారు. కార్యక్రమాల రూపకల్పనను మెరుగుపరచడం, సమానమైన



ఫలితాలను సాధించడం, విజయవంతమైన పథకాలను విస్తరించడం వంటి అంశాల్లో పరిశోధన ఆధారిత నిర్ణయాలు కీలకమని వివరించారు. ప్రజా విధానాల్లో కారణ సంబంధాలను గుర్తించేందుకు ప్రయోగాత్మక పద్ధతులు ఉపయోగపడతాయని, అయితే వాటి అమలులో ఎదురయ్యే అవకాశాలు, సవాళ్లను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.అర్థశాస్త్రంలో పీహెచ్‌డీ పూర్తి చేసిన డాక్టర్ రత్నంకు అనువర్తిత పరిశోధన, ప్రభావ మూల్యాంకనం, అభివృద్ధి విధాన రంగాల్లో 20 ఏళ్లకు పైగా అనుభవం ఉంది. ప్రభుత్వాలు, అంతర్జాతీయ అభివృద్ధి సంస్థలు, పరిశోధనా సంస్థలతో కలిసి ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలోని 28 దేశాల్లో పరిశోధన, మూల్యాంకన కార్యక్రమాలకు నాయకత్వం వహించారు. కారణ నిర్ధారణ, సాక్ష్యాధారిత విధాన రూపకల్పన, విద్య, ప్రజా సేవల్లో కృత్రిమ మేధస్సు వినియోగం, పాలన వంటి అంశాలపై ఆయన పరిశోధనలు కొనసాగుతున్నాయి.

సమర్థవంతమైన, సమ్మిళితమైన, ప్రజలకు ప్రయోజనం చేకూర్చే విధానాల రూపకల్పనలో పరిశోధన, అనుభవపూర్వక ఆధారాల ప్రాధాన్యతను ఈ ఉపన్యాసం వివరించింది. ప్రజా విధానాల అమలులో శాస్త్రీయ మూల్యాంకనం ద్వారా మెరుగైన నిర్ణయాలు తీసుకోవచ్చనే అంశంపై విద్యార్థులు, పరిశోధకులకు ఈ కార్యక్రమం విలువైన అవగాహన కల్పించింది.

టూటౌన్ ఇన్‌స్పెక్టర్‌గా రంజిత్‌రెడ్డి బాధ్యతలు

మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, నవంబరు 23: మిర్యాలగూడ టూటౌన్ పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా ఎ. రంజిత్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన జె. సోమనర్సయ్యను ఆకస్మికంగా నాగర్‌కర్నూల్ స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో నల్లగొండ సీసీఎస్ ఐటీ సెల్‌లో విధులు నిర్వహిస్తున్న రంజిత్‌రె డ్డిని మిర్యాలగూడ టూటౌన్ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు.నూతనంగా బాధ్యతలు చేపట్టిన రంజిత్‌రెడ్డికి ఎస్ఐలు, ఏఎస్ఐలు, పోలీస్ సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.